మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ    ఎడిటర్ : నంద కిషోర్    సంపుటి : 08    సంచిక : 127    ఆదివారం    26 - 10 - 2025    పేజీలు: 8    వెల: 4

## హక్కుల సాధనకు ఉద్యమించాలి




3లో..

## బస్సు ప్రమాద ఘటన

# దర్యాప్తు ముమ్మరం

- మృతి చెందిన బైకర్ వెంట ఉన్న మరో వ్యక్తిని గుర్తించిన పోలీసులు
- 2.24 గంటలకు హెచ్పీ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోయించుకున్న బైకర్
- బస్సు ప్రమాదం కంటే ముందే డివైడర్ ను ఢీకొట్టి బైకర్ మృతి
- రోడ్డుపై ఉన్న బైక్ ను ఢీకొట్టి ఈడ్చుకెళ్లడంతోనే బస్సు దగ్ధం.. 19 మంది మృతి
- ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారించిన పోలీసు అధికారులు

మనగళం, కర్నూలు క్రైం : కర్నూలు సమీపాన చిన్నటేకూరు వద్ద శుక్రవారం తెల్లవారుజామును వేమూరి కావేరి ట్రావెల్స్ బస్ ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 19 మంది మృతిగా 27 మంది గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటన ప్రతిఒక్కరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. హోం మంత్రి వంగలపూడి అనిత, రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా కర్నూలు వచ్చి ఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. అదేవిధంగా క్షతగాత్రులను పరామర్శించిన అనంతరం అన్ని కోణాల్లో విచారణ చేయిస్తామని హోం మంత్రి స్పష్టం చేశారు కూడా. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు ఈ ఘటనపై దర్యాప్తు ముమ్మరం చేశారు. బైకర్ ఎదురుగా రావడంతో బస్సు ఢీకొట్టి ఈ ప్రమాదం జరిగిందనుకున్న నేపథ్యంలో శనివారం ఊహించని సమాచారాన్ని పోలీసులు రాబట్టారు. బైకర్ బస్సు ప్రమాదానికి ముందే రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు గుర్తించారు. బస్సు ప్రమాద ఘటన దర్యాప్తులో భాగంగా బైక్ నడుపుతూ చనిపోయినటువంటి శివశంకర్‌తో పాటు వెనుకాల కూర్చున్న వ్యక్తి ఎర్రి స్వామి(నాని) గా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ ఓ ప్రకటన విడుదల చేశారు. ఎర్రి స్వామిని పోలీసులు వివిధ కోణాల్లో విచారించారు. ఎర్రిస్వామి, బైక్ నడిపిన శివశంకర్ ఇద్దరు కలిసి





2 లో..

## బస్సుల భద్రతపై సోనూ సూద్ ఆందోళన

- మాన్యువల్ ఎమర్జెన్సీ డోర్ తప్పనిసరి చేయాలి
- ఎలక్ట్రానిక్ డోర్ల వైఫల్యంపై ఆందోళన



మన గళం, న్యూఢిల్లీ: అక్టోబర్ 25, 2025 : బాలీవుడ్ నటుడు, సామాజిక కార్యకర్త సోనూ సూద్ ప్రయాణికుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మరియు రవాణా మంత్రిత్వ శాఖకు కీలక విజ్ఞప్తి చేశారు. బస్సుల్లో అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించేందుకు మాన్యువల్ ఎమర్జెన్సీ డోర్ తప్పనిసరి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎలక్ట్రానిక్ ఎమర్జెన్సీ డోర్‌లు ప్రమాద సమయాల్లో తరచుగా పనిచేయకుండా

2 లో..

## ఆర్మీ శక్తి ప్రదర్శన అద్భుతం



న్యూఢిల్లీ: అక్టోబర్ 25, 2025 : రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం రోజున భారత సైన్యం నిర్వహించిన 'సామర్థ్య ప్రదర్శన విన్యాసాల'ను తిలకించారు. సరికొత్త ఆయుధ సంపత్తి, సాంకేతికతతో పాటు కొత్తగా ఏర్పాటు చేసిన సైనిక విభాగాలు ప్రదర్శించిన శక్తిని చూసి ఆయన ప్రశంసించారు. ఈ విన్యాసాల్లో భారత సైన్యంలోకి కొత్తగా చేర్చిన 'భైరవ్ బెటాలియన్' మరియు 'ఆశ్ని ప్లాటూన్' వంటి సంస్థలతో

2 లో..

## రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి తెలిపారు. వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారినికి చర్యలు తీసుకుంటామని, జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాలు, డివిజన్ స్థాయిలోనూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అర్జీల పరిష్కార సమాచారం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవాలని సూచించారు.

## బస్సు ప్రమాద మృతులకి అశ్రునివాళి




మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు సమీపంలో చిన్నటేకూరు దగ్గర శుక్రవారం జరిగిన బస్సు ప్రమాద సంఘటనలో మృతి చెందిన వారికి సీపీఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట శనివారం క్యాండిల్ వెలిగించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ కర్నూల్ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, ఎన్.లెనిన్ బాబు మాట్లాడుతూ హైదరాబాదు నుండి బెంగళూరుకు పోతున్న కావేరి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కర్నూలు సమీపంలో చిన్నటేకూరు దగ్గర తెల్లవారుజామున 3 గంటల సమయంలో జరిగిన ప్రమాదంలో 19 మంది, బస్సు ఢీ కొట్టిన మోటార్ సైకిల్ పై వెళుతున్న ఒక వ్య మరణించడం బాధాకరమన్నారు. ఈ సంఘటన కు డ్రైవర్ నిర్లక్ష్యంతో పాటు రవాణా అధికారుల నిర్లక్ష్యము స్పష్టంగా కనపడుతుందన్నారు. కావేరి ట్రావెల్స్ యాజమాన్యం నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపించారు. బస్సు రిజిస్ట్రేషన్ ఒరిస్సా రాష్ట్రంలో చేసి

2 లో..

## ఒక్క జిల్లాలోనే 222 టన్నుల బంగారం..

- రాజస్థాన్‌లో బయటపడ్డ కొత్త గనులు!
- 222 టన్నుల స్వచ్ఛమైన బంగారం లభించే అవకాశం
- మైనింగ్ లైసెన్స్‌ల టెండర్ ప్రక్రియ



మన గళం, అక్టోబర్ 25, 2025 : దేశంలో అత్యధిక ఖనిజ సంపద కలిగిన రాష్ట్రాల్లో ఒకటైన రాజస్థాన్, ఇప్పుడు భారీ బంగారు నిల్వల విషయంలో మరోసారి వార్తల్లో నిలిచింది. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతమైన బన్స్‌వారా జిల్లాలో భారీగా బంగారు నిక్షేపాలు ఉన్నట్లు అధికారులు ధృవీకరించారు. ఈ ఆవిష్కరణతో బన్స్‌వారా.. దేశానికి కొత్త స్వర్ణ రాజధానిగా మారే అవకాశం ఉంది. జిల్లాలోని ఘటోల్ తెహసీల్ పరిధిలోని కంకారియా గ్రామంలో ఈ కొత్త నిల్వలను

2 లో..

## నారా లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన ముగింపు



2 లో..

- ఏపీకి బలమైన భాగస్వామ్యాల ఆశ

## మద్యం కొనుగోళ్లలో జాగ్రత్త




మన గళం, అమరావతి, అక్టోబర్ 25, 2025 : ఆంధ్రప్రదేశ్‌లోని మద్యం దుకాణాలు మరియు బార్ల వద్ద మద్యం కొనుగోలు చేసే వినియోగదారులు తప్పనిసరిగా పాటించాల్సిన ఒక ముఖ్యమైన విషయాన్ని

2 లో..



## అప్రమత్తంగా ఉండాలి

మన గళం, అమరావతి :

బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను కాకినాడ పరిసరాల్లో తీరాన్ని తాకే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా

2 లో..

## కర్నూలు ప్రమాదం ఎఫెక్ట్

### బెంగళూరులో 30 ప్రైవేట్ బస్సులు సీజ్




మన గళం, బెంగళూరు: అక్టోబర్ 25, 2025 : కర్నూలు జిల్లాలో ఇటీవల జరిగిన ఘోర బస్సు ప్రమాదం నేపథ్యంలో అప్రమత్తమైన బెంగళూరు రవాణా శాఖ అధికారులు శుక్రవారం నాడు నగరంలో మెరుపు దాడులు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి నగరానికి

2 లో..

# బస్సుల భద్రతపై సోనూ సూద్ ఆందోళన

పోయే అవకాశం ఉందని సోనూ సూద్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. అందుకే, ప్రయాణికుల భద్రత కోసం ప్రతి లగ్జరీ బస్సులో ఎలక్ట్రానిక్ డోర్‌తో పాటు మాన్యువల్ ఎమర్జెన్సీ డోర్ కచ్చితంగా ఉండాలని ఆయన అన్నారు. ఈ నిబంధనను చట్టం ద్వారా తప్పనిసరి చేయాలని సూచించారు.

**– పర్మిట్ల పునరుద్ధరణకు ముందు ధ్రువీకరణ**

భద్రతా నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు, బస్సు ఆపరేటర్లు తమ పర్మిట్‌లను పునరుద్ధరించుకోవడానికి ముందు మాన్యువల్ ఎమర్జెన్సీ డోర్ ఉన్నట్లు ఫోటోలతో సహా రుజువును అప్‌లోడ్ చేయాలని సోనూ సూద్ కోరారు. ఈ ఆదేశాలను పాటించడానికి ఒక నెల గడువు ఇవ్వాలని సూచించారు. ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదు అని మంత్రి నితిన్ గడ్కరీ మరియు రవాణా శాఖకు ఆయన విజ్ఞప్తి చేశారు. తక్షణమే ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఆర్మీ శక్తి ప్రదర్శన అద్భుతం

పాటు, ఆధునిక ఆపరేషన్ల నిర్వహణకు సైన్యంలోకి తీసుకువచ్చిన అత్యాధునిక సాంకేతిక ఆస్తుల సమీకృత వినియోగాన్ని సైనికులు ప్రదర్శించారు. ఈ ప్రదర్శన అత్యంత శక్తివంతంగా, సమర్థవంతంగా ఉందని రాజ్‌నాథ్ సింగ్ ట్విట్టర్ వేదికగా తెలిపారు.

**– సైన్యం ఆధునికీకరణపై దృష్టి**

ఈ (ప్రదర్శన పాత) మరియు కొత్త యొక్క సజావుగా సమ్మిళితాన్ని సూచిస్తుందని రక్షణ మంత్రి పేర్కొన్నారు. భారత సైన్యం సామర్థ్య అభివృద్ధి మరియు సైనిక ఆధునికీకరణ పై ఎంతగా దృష్టి సారించిందో ఈ ప్రదర్శన హైలైట్ చేసిందని రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. భారత సైన్యం యొక్క శక్తి మరియు సంసిద్ధతను ఈ విన్యాసాలు ప్రతిబింబించాయని ఆయన అన్నారు.

# ఒక్క జిల్లాలోనే 222 టన్నుల బంగారం..

గుర్తించారు. ఇప్పటికే ఇక్కడ ఉన్న భుకియా, జగ్‌పురా గనుల తర్వాత ఇది మూడో అతిపెద్ద బంగారు గనిగా నిలవనుంది. భూగర్భ శాస్త్రవేత్తలు జరిపిన సర్వేల ప్రకారం, కంకారియా ప్రాంతంలో దాదాపు 3 కిలోమీటర్ల మేర బంగారు ఖనిజం విస్తరించి ఉన్నట్లు బలమైన ఆధారాలు లభించాయి. ఈ ప్రాంతంలో మొత్తం 940.26 హెక్టార్ల విస్తీర్ణంలో 113.52 మిలియన్ టన్నుల బంగారు ఖనిజం ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ ఖనిజాన్ని శుద్ధి చేసిన తర్వాత సుమారు 222.39 టన్నుల స్వచ్ఛమైన బంగారం లభించవచ్చని నిపుణులు చెబుతున్నారు. రాజస్థాన్‌లో ఇప్పటివరకు వెలుగుచూసిన అతిపెద్ద బంగారు నిల్వల్లో ఇది కూడా ఒకటి కావడం గమనార్హం.

**– బంగారంతో పాటు ఇతర ఖనిజాలు, వాణిజ్య ప్రాధాన్యత**

కంకారియా–గారా ప్రాంతంలో బంగారంతో పాటు రాగి, నికెల్, కోబాల్ట్ వంటి ఇతర విలువైన ఖనిజాలు కూడా లభించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అన్ని అనుమతులు లభించి, మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభమైతే, భారతదేశంలో బంగారం తవ్వకాలు జరిపే అతికొద్ది రాష్ట్రాల జాబితాలో రాజస్థాన్ కూడా చేరుతుంది. అంతేకాకుండా, భవిష్యత్తులో దేశం మొత్తం బంగారం డిమాండ్‌లో 25 శాతం వరకు ఒక్క బన్స్‌వారా జిల్లా నుంచే సరఫరా చేసే సామర్థ్యం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

గతంలో భుకియా–జగ్‌పురా మైనింగ్ బ్లాక్‌ల వేలంలో గెలిచిన సంస్థ అవసరమైన హామీ మొత్తాన్ని జమ చేయడంలో విఫలం కావడంతో ప్రభుత్వం ఆ లైసెన్స్‌ను రద్దు చేసింది. ప్రస్తుతం ఈ బ్లాక్‌ల కోసం మళ్లీ టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా, నవంబర్ 3న బిడ్లను తెరవనున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి అత్యధిక రెవెన్యూ వాటాను చెల్లించే సంస్థకు మైనింగ్ లైసెన్సును కేటాయించనున్నారు.

# కర్నూలు ప్రమాదం ఎఫెక్ట్

వస్తున్న ప్రైవేటు బస్సులను తనిఖీ చేసి, నిబంధనలు పాటించని 30 బస్సులను సీజ్ చేశారు. రవాణా శాఖ అదనపు కమిషనర్ ఓంకారేశ్వరి నేతృత్వంలో ఈ విస్తృత స్థాయి సోదాలు చేపట్టారు. తమిళనాడు, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ వంటి ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్‌తో నడుస్తున్న బస్సులను అధికారులు ముఖ్యంగా తనిఖీ చేశారు. ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలోని అత్తిబెలె చెక్‌పోస్ట్ వద్ద పలు ప్రైవేట్ బస్సులను పరిశీలించారు. నగరంలోని వివిధ ప్రాంతాలలో శుక్రవారం తెల్లవారుజాము నుంచే దాడులు చేస్తున్నామని కమిషనర్ ఓంకారేశ్వరి తెలిపారు. ఆల్ ఇండియా టూరిస్ట్ బస్సులను పరిశీలించగా, పలు బస్సులకు అనుమతి గడువు ముగిసినా తిరుగుతున్నట్లు గుర్తించామని ఆమె అన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన 30 బస్సులను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ తనిఖీలలో ఆర్టీఓలు, బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



# బస్సు ప్రమాద ఘటన దర్యాప్తు ముమ్మరం





లక్ష్మీపురం గ్రామం నుండి అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 2 గంటల కు బయలు దేరారు. ఎర్రిస్వామి ని వదలడానికి శివశంకర్ తుగ్గలికి బయలు దేరాడు. ఎర్రిస్వామిని వదలడానికి వెళ్ళిన పల్సర్ బైక్ కు మార్గం మధ్యంలో కియా షోరూం దగ్గర గల హెచ్పీ పెట్రోల్ బంక్ వద్ద అర్ధరాత్రి దాటిన తర్వాత 2.24 గంటలకు రూ. 300 పెట్రోల్ పట్టించుకుని బయలు దేరినట్లు గుర్తించారు. బయలు దేరిన కొద్ది సేపటికి చిన్నటేకూరు సమీపంలో శివశంకర్ బైక్ నడుపుతూ స్కిడ్ అయి రోడ్డు కు కుడి ప్రక్కన ఉన్న డివైడర్ ను ఢీ కొట్టాడు. బైక్ నడుపుతున్న శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుకాల ఉన్న ఎర్రిస్వామి(నాని) స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. ప్రమాద ఘటన స్థలం దగ్గర రోడ్డు మధ్యలో పడిపోయిన శివశంకర్ ను ఎర్రిస్వామి బయటికి పక్కకు లాగి శ్వాస చూశాడు. చనిపోయాడని అతను నిర్ధారించుకుంటూనే రోడ్డుపై పడి ఉన్న బైక్ ను తీద్దామనుకున్నాడు. అంతలోనే బైక్ ను వేమూరి కావేరి ట్రావెల్స్ బస్ ఢీ కొట్టి కొద్ది దూరం ఈడ్చుకెళ్ళింది. బస్సు క్రింద మంటలు రావడంతో భయాందోళనకు గురైన ఎర్రిస్వామి తన స్వంత ఊరైనా తుగ్గలి కి బయలు దేరి వెళ్ళిపోయినట్లు దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. బస్సు ప్రమాదం కంటే ముందే బైకర్ శివశంకర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు ప్రకటనలో తెలిపారు. ఈ ప్రమాద విషయం పై ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు. తదుపరి దర్యాప్తును కొనసాగిస్తున్నామని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రకటించారు. ఇంకా పూర్తిస్థాయితో దర్యాపు చేపడుతామన్నారు.



# బస్సు ప్రమాద మృతులకి అశ్రునివాళి

తెలంగాణ,ఆంధ్ర,కర్ణాటక రాష్ట్రాలలో బస్సు తిప్పుతున్నారని, బస్సులో స్లీపర్ ఏర్పాటు కు పర్మిషన్ లేకపోయినా ఏర్పాటు చేశారన్నారు. రవాణా అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయకుండా నిర్లక్ష్యం వహించడంతో ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యం ఇష్టారాజ్యంగా మారిందన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి 1 కోటి రూపాయలు ఎక్స్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా క్షతగాత్రులకు రూ. 5 లక్షలు ఇవ్వాలన్నారు. ప్రమాదంలో మరణించిన వారి మృతికి ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి సి మహేష్, నగర అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్, చంద్రశేఖర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, నగర అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, బిసన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, నగర కార్యదర్శి అశోక్, ఏపీ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి శ్రావణి, నగర కార్యదర్శి వి భారతి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, సిపిఐ నగర నాయకులు ఈశ్వర్, కృష్ణారెడ్డి, ధనలక్ష్మి,రేణుక, జయమ్మ, ప్రసాదు రాముడు తదితరులు పాల్గొన్నారు.

# నారా లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన ముగింపు

మన గళం, న్యూఢిల్లీ/ అక్టోబర్ 25, 2025 : నారా లోకేష్ చేపట్టిన ఏడు రోజుల ఆస్ట్రేలియా పర్యటన నేటితో ముగిసింది. నాలుగు నగరాల్లో పర్యటించిన ఆయన, ఈ ప్రయాణం "అత్యంత లోతైన అంతర్దృష్టిని" ఇచ్చిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు కీలకమైన రంగాల్లో అంతర్జాతీయ సహకారం కోసం లోకేష్ ఈ పర్యటన నిర్వహించారు. ఈ పర్యటనలో లోకేష్ వివిధ రంగాల ప్రముఖులతో విస్తృత స్థాయిలో సమావేశాలు నిర్వహించారు. ఆయన ముఖ్యంగా విశ్వవిద్యాలయాలు, అగ్రగామి పరిశ్రమలు, ఇండియా–ఆస్ట్రేలియా మండలి, సముద్ర ఉత్పత్తుల వాణిజ్య సంస్థలు మరియు క్రీడా సముదాయాల ప్రతినిధులతో మాట్లాడారు. భారతదేశం %2.4 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ దిశగా సాగుతున్న తరుణంలో, ఆంధ్రప్రదేశ్‌ను ముందుకు తీసుకెళ్లడానికి మూడు కీలక అంశాలపై ఆయన ప్రధానంగా చర్చలు జరిపారు. ఆ అంశాలు మానవ వనరుల బలోపేతం మరియు నైపుణ్యం కలిగిన యువతను అభివృద్ధి చేయడం. అలాగే, పరిశోధన మరియు అభివృద్ధి రంగాలను ముందుకు తీసుకెళ్లడంపైనా దృష్టి పెట్టారు అంతేకాకుండా, క్రీడలను శక్తివంతమైన ఆర్థిక కార్యకలాపాల మార్గంగా మార్చడంలో అపారమైన సామర్థ్యాన్ని చూసినట్లు ఆయన ప్రత్యేకంగా తెలిపారు. క్రీడా రంగాన్ని ఆర్థిక వృద్ధికి ఉపయోగించుకోవాలనే ఆలోచనను ఆయన నొక్కి చెప్పారు. ఈ పర్యటన ద్వారా తాను "అపారమైన విషయాలు నేర్చుకున్నానని" లోకేష్ స్పష్టం చేశారు. ఆస్ట్రేలియాలో జరిగిన ఈ చర్చలు త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌కు అర్థవంతమైన భాగస్వామ్యాలుగా రూపాంతరం చెందుతాయనే పూర్తి విశ్వాసం తనకు ఉందని ఆయన తన ప్రకటనలో తెలిపారు. ఈ పర్యటన ద్వారా ఏపీకి పెట్టుబడులు, సాంకేతిక సహకారం లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# మద్యం కొనుగోళ్లలో జాగ్రత్త

తెలుగుదేశం పార్టీ (టీడీపీ) సోషల్ మీడియా ద్వారా తెలియజేసింది. మద్యం దుకాణాలు, బార్లలో మద్యం కొనే ముందు "ఇక్కడ విక్రయించే మద్యం క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా నాణ్యమైనదని ధృవీకరించాం" అన్న బోర్డు ఉందో లేదో వినియోగదారులు చెక్ చేయాలని టీడీపీ సూచించింది. ప్రతి మద్యం బాటిల్ యొక్క ప్రామాణికతను ధృవీకరించడాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తప్పనిసరి చేసిందని టీడీపీ స్పష్టం చేసింది. నాణ్యతలేని, కల్తీ మద్యం అమ్మకాలు జరగకుండా వినియోగదారుల భద్రత కోసం ఈ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపింది. ఈ నేపథ్యంలో, మద్యం కొనుగోలుదారులు ఈ బోర్డులను పరిశీలించి, నాణ్యమైన మద్యం మాత్రమే విక్రయిస్తున్నారని నిర్ధారించుకోవాలని టీడీపీ కోరింది.




# మొంథా తుపాను పట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని తెలిపారు. శనివారం కాకినాడ జిల్లా కలెక్టర్ తో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాకినాడ జిల్లాలో సముద్ర తీరం ఉన్న తుని, పిఠాపురం, కాకినాడ రూరల్, కాకినాడ అర్బన్ నియోజక వర్గాలతోపాటు తాళ్ళరేవు మండలంపైనా తుపాన్ ప్రభావం ఎక్కువగా ఉండబోతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ విషయంపై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "తుపానుపై ప్రజలను అప్రమత్తం చేయండి. జిల్లావ్యాప్తంగా తీరం వెంబడి ఉన్న గ్రామాల ప్రజలను సురక్షితంగా ఉంచేందుకు తగిన చర్యలు తీసుకోండి. తుపాను షెల్టర్లలో ఆహారం, ఔషధాలు, పాలు లాంటివన్నీ సమకూర్చి ఉంచండి. వాతావరణ శాఖ హెచ్చరికలకు అనుగుణంగా అన్ని విభాగాలను సిద్ధం చేయాలని సూచించారు. రెవెన్యూ, వ్యవసాయ, నీటిపారుదల, పోలీస్, అగ్నిమాపక శాఖలతోపాటు డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలను సిద్ధంగా ఉంచుకోవాలి. ఉప్పాడ సమీపంలో తీరం కోతకు గురయ్యే ప్రాంతంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. మత్స్యకారులను అప్రమత్తం చేయండి" అని స్పష్టం చేశారు.

ఏలేరు రిజర్వాయర్ పరిస్థితిపై ఆరా తీశారు. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యానికి చేరువగా నీటి నిల్వలు పెరుగుతున్నాయని, నీటిని వదిలేటప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తామని జిల్లా కలెక్టర్ శ్రీ షాన్ మోహన్ తెలిపారు. వరద ముంపు పరిస్థితి వస్తే నీటిపారుదల శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని, పిఠాపురం, పెద్దాపురం నియోజక వర్గాల రైతులు, ప్రజలకి సమాచారం ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచించారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## హక్కుల సాధనకు ఉద్యమించాలి





– సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ గఫూర్

మనగళం, కర్నూలు సిటీ : హక్కుల సాధనకు ఉద్యమించాలని, అప్పుడే కార్మికుల బతుకులు మారుతాయని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కార్మిక కర్షక భవన్లో సీఐటీయూ కర్నూలు జిల్లా 13వ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా సీఐటీయూ జెండాను మెడికల్ రేప్స్ యూనియన్ నాయకులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు సీఐటీయూ జెండా ఔన్నత్యాన్ని గురించి గేయాలను ఆలపించారు. అనంతరం అమరవీరుల స్థూపానికి సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు ఏవీ నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎం ఏ గఫూర్ జిల్లా నాయకులు పూలను వేస్తూ శ్రద్ధాంజలి ఘటించి నివాళి అర్పించారు. ప్రజానాట్యమండలి కళాకారులు సీఐటీయూ అభివృద్ధి కోసం పాటుపడిన నాయకులను స్మరించుకుంటూ గేయాలను ఆలపించారు. ఈ సభ ప్రారంభానికి ముందు సీఐటీయూకి విశేష సేవలు అందించి తుది శ్వాస వరకు పాటుపడి అమరులైన నాయకులు రాజగోపాల్, బి. మహానంద రెడ్డి, జె. ఎన్. శేషయ్యల చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సభకు పిఎస్. రాధాకృష్ణ, పి. నిర్మల, ఈరన్న అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్. ఎ. గఫూర్ మాట్లాడుతూ రాజగోపాల్, మహానంద రెడ్డి, జె. ఎన్. శేషయ్య, రాజేశ్వర్ రెడ్డి లు తమ ప్రాంతాల్లో సీఐటీయూ కోసం చేసిన కృషి, విశాల ప్రజా ఉద్యమాల గురించి వివరించారు. పాలకులు కార్మిక వర్గాన్ని మతపరంగా విభజిస్తున్నారని విమర్శించారు. మతాలకతీతంగా కార్మిక వర్గం ఐక్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉద్ఘాటించారు. కుల మతాలకతీతంగా కార్మిక వర్గం ఐక్యం చేసి కొత్త కార్మిక సమాజం మార్పుకోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం కార్మికుల చట్టాలను మార్చేస్తూ హక్కులను నిర్వీర్యం చేసిందన్నారు. లోకేష్ విద్యాశాఖ మంత్రి అయినప్పటికీ అన్ని శాఖల మంత్రిగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. కనీస వేతనాలు అమలు చేయడం లేదని చెప్పారు. అందుకే కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలను ఓడించి ప్రజల కార్మికుల శ్రేయస్సు కోరే ప్రభుత్వాలను గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండి అంజిబాబు గత మూడు సంవత్సరాల్లో చేసిన ఉద్యమాలు కార్యక్రమాలు నిర్మాణం నివేదిక కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్స్ బి రామాంజనేయులు, నారాయణస్వామి, ప్రభాకర్, సిహెచ్ సాయి బాబా, విజయ రామాంజనేయులు, ఉమాదేవి, నాయకులు రఘు బాబు, దివాకర్, నరసింహులు, అబ్దుల్ దేశాయ్, పిఎస్ గోపాల్, రాముడు, మధు, హుస్సేనయ్య, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## కిరాణా, చిన్నకార వ్యాపారస్తులకు తోడుగా ఉంటా:- ఆదోని ఎమ్మెల్యే డా పీవీ పార్థసారధి



కర్నూలు జిల్లా (ఆదోని ) మనగలం : ఆదోని పట్టణంలోని కిరాణా వ్యాపారస్తుల అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధినీ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కిరాణా అసోసియేషన్ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే పార్థసారధికి విన్నవించారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి. మాట్లాడుతూ... కిరాణా మరియు చిన్నకార వ్యాపారస్తులందరూ కూడా రిలయన్స్ స్మార్ట్ బజార్ ,డీమార్ట్ లాంటి పెద్ద పెద్ద సంస్థలు ఆదోనిలో ఏర్పాటు చేయడం కారణంగా వీరి వ్యాపారాలు దెబ్బతింటున్నాయని దీనిని నేను ఏకీభవిస్తున్నానని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి తెలిపారు. మనకు నిత్యం సహాయ సహకారాలు అందించే వీధి వ్యాపారస్తులకు మనం తోడుగా నిలవాలని పిలుపునిచ్చారు. వీరి గురించి ప్రత్యేకంగా ఆలోచించి సరేనా పరిష్కారం చేస్తామని ఎమ్మెల్యే పార్థసారథి హామీ ఇచ్చారు.

## కేంద్ర ప్రభుత్వ మద్దతు ధరతో రైతులకు భరోసా, ఆదోనిలో సిసిఐ సిద్ధం : ఎమ్మెల్యే పార్థసారధి



మనగలం : ఆదోని ఎమ్మెల్యే డా పార్థసారథి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో “ది కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ద్వారా 2025%-%26 పత్తి సీజన్ ప్రారంభమవుతుందని, రైతు సోదరులు ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర కంటే తక్కువకు తమ పత్తిని అమ్మకూడదని విజ్ఞప్తి చేశారు. రైతులు సి.సి.ఐ. ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దే పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలని ఆయన సూచించారు. రైతులు తమ పత్తిని కపాస్ కిసాన్ యాప్ ద్వారా ముందుగా నమోదు చేసుకుని స్లాట్ బుక్ చేసుకోవాలని, ఇప్పటికే ఈ-క్రాప్ లో నమోదు చేసుకున్న వారు తమ ఆధార్, పట్టాదారు పాస్ బుక్ ప్రతులతో సమీప రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. రైతులు పత్తిని మార్కెట్‌కు తీసుకువచ్చేటప్పుడు శుభ్రమైన, తేమశాతం 8 నుండి 12 శాతం మధ్యలో ఉన్న నాణ్యమైన పత్తిని మాత్రమే తీసుకురావాలని అన్నారు, ప్లాస్టిక్ సంచుల్లో పత్తిని తీసుకురావడం మానుకోవాలని సూచించారు. సి.సి.ఐ. కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తి అమ్మకం జరిగితే రైతులకు పారదర్శకమైన ధర, నేరుగా బ్యాంక్ ఖాతాల్లో చెల్లింపులు జరగడం జరుగుతుందని తెలిపారు. రైతు సోదరులు మధ్యవర్తులు లేదా దళారులను ఆశ్రయించకుండా నేరుగా సి.సి.ఐ. కేంద్రాలకే పత్తిని విక్రయించాలని ఆయన కోరారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, పత్తి ఉత్పత్తిదారులకు సరైన ధర అందించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయబడ్డాయని ఆయన అన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆదూరి విజయ్ కృష్ణ, సి.సి.ఐ. కమర్షియల్ ఆఫీసర్ శ్రీనివాస్, మార్కెట్ యార్డ్ సెక్రటరీ గోవిందు మరియు ఇతర సిబ్బంది ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిని క్యాంపు కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలసి, ఆదోనిలో అక్టోబర్ 27వ తేదీ సోమవారం నుండి ప్రారంభమవుతున్న సి.సి.ఐ. కొనుగోలు కార్యక్రమానికి ఆహ్వానించారు. ఎమ్మెల్యే ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిపారు. రైతులకు మద్దతు ధరపై అవగాహన కల్పించాలంటూ ఎమ్మెల్యే మార్కెట్ యార్డ్ సిబ్బందికి సూచించారు.

## సంక్షేమ పథకాలపై న్యాయ విజ్ఞాన సదస్సు



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు జిల్లా న్యాయ సేవా సదన్ లో శనివారం సంక్షేమ పథకాలపై జడ్జి బి.లీలా వెంకట శేషాద్రి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వివిధ శాఖలను సమన్వయం చేసుకొని, అర్హులు, అట్టడుగు వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా న్యాయ సేవ అధికార సంస్థ కృషి చేస్తుందని బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. సంక్షేమ పథకాలు పొందేందుకు అవసరమైన కుల ధృవీకరణ పత్రం, నివాస ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, బీపీఎల్ సర్టిఫికేట్, కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు మొదలైనవి పొందడానికి సహాయం చేయడం కార్యక్రమంలోని ముఖ్య అంశం అని తెలిపారు. కార్యక్రమంలో అన్ని సంబంధిత శాఖల ప్రతినిధులు, అధికారులు, ఇతర భాగస్వాములు పాల్గొన్నారు.

## మహిళా ఐక్య వేదిక నుండి భారతమ్మ తొలగింపు



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు బి క్యాంపులోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళా ఐక్య వేదిక ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి జిల్లాల కార్యవర్గ సమావేశాన్ని ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి హాజరై మాట్లాడారు. మహిళా ఐక్య వేదిక లో రాయలసీమ డివిజన్ అధ్యక్షురాలుగా ఉన్న ఈడిగ భారతమ్మ ను తొలగించామన్నారు. మహిళ ఐక్య వేదిక ప్రతిష్టను దిగజార్చే విధంగా ఎవరు ప్రవర్తించిన ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మహిళా ఐక్య వేదిక సభ్యులు అందరూ కూడా క్రమశిక్షణతో సంఘం యొక్క విధివిధానాలతో పనిచేయాలని ఆమె అన్నారు. అలా కాకుండా సంఘానికి ద్రోహం చేయాలనే వారిపై కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే ప్రతి సంవత్సరం జరిగే బహుజన వన భోజనాల కార్యక్రమం నవంబర్ 9 వ తేదీన ఉంటుందని, సభ్యులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆమె పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకురాళ్లు ఈరమ్మ , ఎలీశమ్మ , హుస్సేన్ బీ, ఆకుతోట పద్మావతి, దస్తగిరమ్మ, ఖాసింబీ, షేకున్ బీ , రేవతి, కొమ్ము పెద్దక్క , రంగమ్మ , మరియమ్మ , లక్ష్మేశ్వరి, కన్యాకుమారి, ఖాజాబీ, అమీనాబీ తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల కోసం ఉచిత న్యాయ సహాయ కేంద్రం



– జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

మనగళం, కర్నూలు సిటీ : చిన్న టేకుర్ గ్రామం సమీపంలో జరిగిన ఘోర బస్సు దుర్ఘటనకు గురైన బాధితులు, కుటుంబ సభ్యులు, బంధువుల కోసం ఉచిత న్యాయ సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి లీలా వెంకట శేషాద్రి తెలిపారు. న్యాయ సంబంధమైన సలహాలు, న్యాయ సహాయం, నష్టపరిహారం తదితర సమస్యలు ఉచితంగ అందజేస్తామన్నారు. బాధితులకు ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే నేరుగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, లేదా టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు ఫోన్ చేసి సమస్యను తెలుపు కోవచ్చని తెలిపారు. న్యాయ సేవ అధికార సంస్థ ప్యార లీగల్ వాలంటర్స్ సాయి, ప్రదీప్ తదితరులు బస్సు దుర్ఘటనలో గాయపడి వారిని ఆసుపత్రులకు తరలించి మెరుగైన వైద్యం అందజేస్తున్నారన్నారు.

## జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోండి




మనగళం, కర్నూలు సిటీ : యువత ఉపాధి కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని, జాబ్ మేళాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారిణి పి. దీప్తి సూచించారు. శనివారం కర్నూలు జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించారు. టాటా ఎలక్ట్రానిక్స్, ఫ్లిప్ కార్ట్, ఓరిగో ఫైనాన్స్ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి అధికారిణి పి. దీప్తి మాట్లాడుతూ జాబ్ మేళాకు 90 మంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరయ్యారని, 40 మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసమే ఎదురు చూడకుండా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఎదుగుదలకు బాటలు వేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. కార్యక్రమంలో ఒకేషనల్ గైడెన్స్ అధికారిణి కళ్యాణి, జూనియర్ ఉపాధి అధికారి సోమశివారెడ్డి, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కళాకారుల సమస్యల పరిష్కారానికి పోరాడుదాం



మనగళం, కర్నూలు సిటీ : ప్రజా కళాకారుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగిద్దామని ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వి నాగరాజు సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీఆర్ భవన్ లో ప్రజానాట్యమండలి జిల్లా జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాల నిర్లక్ష్యం మూలంగా ప్రజల కోసం పనిచేసే కళాకారుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. కళాకారుల గుర్తింపు కార్డులు, పెన్షన్లు, ఇంటి స్థలాలు, బస్సుల ప్రయాణం రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వృద్ధ కళాకారులకు పెన్షన్ ప్రభుత్వం 55 సంవత్సరాలు ఉంటేనే ఇస్తున్నారని, 50 సంవత్సరాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలో ప్రభుత్వమే కళాక్షేత్రం ఏర్పాటు చేయాలన్నారు. దివంగత కోట్ల విజయభాస్కర్ రెడ్డి రాజు విహార్ పాత ఆర్టీసీ డిపో వెనుక భాగంలో కళాక్షేత్రానికి శంకుస్థాపన చేశారని, నేటికీ నిర్మాణానికి నోచుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై పలుమార్లు అధికారులు, పాలకులకు వినతులు సమర్పించినా స్పందన లేదని విమర్శించారు. కళాకారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నవంబర్ 12వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నామని హెచ్చరించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి నగర అధ్యక్షులు శ్రీనివాసులు, నగర కార్యదర్శి శివ, నగర గౌరవ అధ్యక్షులు మాణిక్యం, నగర నాయకులు మల్లి, హుస్సేన్, కళాకారు మునెమ్మ, వరలక్ష్మి, అపర్ణ,జ్యోతిబాయ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్ఎన్ఎల్ సమ్మాన్ ప్లాన్.. రూ.1812తో ఏడాది కాలపరిమితి

న్యూఢిల్లీ, మనగళం : ప్రభుత్వరంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ సరికొత్త ‘సమ్మాన్ ప్లాన్’ను ఆవిష్కరించింది. ఏడాది కాలపరిమితి కలిగిన ఈ ప్లాన్ ధర రూ. 1,812గా నిర్ణయించింది. ఈ ప్లాన్ కింద అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్‌తోపాటు రోజుకు 2జీబీ డాటాతోపాటు 100 ఎస్ఎంఎస్‌లు పంపుకోవచ్చును. 60 ఏండ్లకు పైబడి వారిని దృష్టిలో పెట్టుకొని సంస్థ ఈ ప్లాన్‌ను ఆవిష్కరించింది. ఇది చౌకైన ప్లాన్‌తోపాటు ఏడాది కాలపరిమితితో అందిస్తున్నట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. వచ్చే నెల 18 వరకు ఈ ప్లాన్ అందుబాటులో ఉంటుందని తెలిపింది. ఈ ప్లాన్‌తో తరుచుగా రీచార్జి చేయాల్సిన అవసరం ఉండదు. దీంతోపాటు రూపాయికే 4జీ సిమ్‌తోపాటు నెలరోజుల పాటు ఉచితంగా టెలికాం సేవలు పొందే ప్లాన్‌ను సైతం ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ప్లాన్‌కు కస్టమర్ల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని పేర్కొంది. ఈ ప్లాన్ కింద రోజుకు 2జీబీ డాటా, 100 ఎస్ఎంఎస్‌లు, అన్‌లిమిటెడ్ వాయిస్ కాలింగ్ చేసుకోవచ్చును.

# మహిళలకు భద్రత కల్పించాలి

- మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు



మనగళం, కర్నూలు సిటీ : షాపింగ్ మాల్స్ లలో వివిధ రకాల షాపులలో పనిచేసే మహిళలకు భద్రత కల్పించాలని మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యులు ఎం సుధాకర్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పని చేస్తున్న షాపింగ్ మాల్స్ లలో పనిచేస్తున్న మహిళలు గతంలో రాత్రి 8:30 వరకు పని చేసేవారని, ఇప్పుడు 10:30వరకు చేయాల్సిన దుస్థితి నెలకొందని అసహనం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ చర్యల మూలంగానే ఈ పరిస్థితి నెలకొందని విమర్శించారు. షాపులలో పనిచేసే మహిళలు రాత్రి 10:30వరకు పనిచేయడం మూలంగా భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. నంద్యాలలో దసరా పండుగ సందర్భంగా జ్యువెలరీ షాపులో మూడు రోజులుగా వర్కర్లను ఇండ్లకు పంపడంలేదనీ, జ్యువెలరీ షాపు ముందు ఒక కుటుంబం ధర్నా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పేద మహిళలతో గొడ్డుచాకిరి చేయిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, కార్మికశాఖ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. మహిళలను రాత్రి 8 నుండి 8:30 గంటలకు ఇంటికి వెళ్లేలా కార్మిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్సీ బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, రాష్ట్ర ఐఎన్టీయూసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి పాషా, ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షులు ఈ లాజరస్, కాంగ్రెస్ నాయకులు జాన్ సదానందం తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మికతతో ప్రశాంతత



మనగళం, కర్నూలు సిటీ : ఆధ్యాత్మిక చింతనతో మనిషికి ప్రశాంతత కలుగుతుందని పాణ్యం శాసనసభ్యులు గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ నుండి 5వ తేదీ వరకు కర్నూలు నగరం, మాధవ నగర్ లోని శివ రామాలయం నందు జరుగనున్న ధార్మిక సప్తహానికి సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే తమ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఇటువంటి కార్యక్రమాలు సమాజం ఎంత ఉపయోగించుకుంటే అంత ప్రయోజనకరమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ధార్మిక సప్తాహంలో భాగంగా 30వ తేదీ తెలుగు పండితులు డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్య తృప్తదాస్, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ తొగట సురేశ్ బాబు, డాక్టర్ ఎస్. దేవి దయానంద సింగ్, జి. బలరామాచార్య తదితరులతో కార్తిక మాస విశిష్టతపై ధార్మిక ప్రవచనాలు ఉంటాయన్నారు. ప్రతిరోజు శివస్తోత్ర, నామ పారాయణం ఉంటుందన్నారు. నవంబర్ 2వ తేదీ ఆదివారం సాయంత్రం జ్వాలాతోరణం, 5వ తేదీ సాయంత్రం సహస్ర కార్తిక దీపోత్సవం ఏర్పాటు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో శ్రీ శివరామాలయం చైర్మెన్ జి. శేషాచలం, శ్రీశివరామాలయం కమిటీ సభ్యులు, అర్చకులు, శ్రీగోదా విష్ణు సహస్రనామ సంఘం సభ్యులు మద్దికుంట రాంభూపాల్ రెడ్డి, కర్నూలు నగర సాహితీవేత్త తెలుగు భాష వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జె.ఎస్.ఆర్. కె. శర్మ తదితరులు పాల్గొన్నారు.

# నూతన సిమెంట్ రోడ్డు కు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే పార్థసారథి





మనగళం, ఆదోని పట్టణంలోని ఏడవ వార్డు కొనిముల్ల ఏరియాలో సీసీ రోడ్డు నిర్మాణమునకు ఎనిమిది లక్షల తోపాటు రెండు లక్షలతో డ్రైనేజీ పనులకు శనివారం ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆదోని ప్రజలకు శుభవార్త కేంద్ర ప్రభుత్వం డైరెక్టుగా మున్సిపాలిటీలో జమ చేసే 15వ ఆర్థిక సంఘం నిధులు ఐదు కోట్ల 80 లక్షలు ఆదోని మునిసిపాలిటీకి విడుదల అయ్యాయని దీని ద్వారా పట్టణంలోని సమస్యలను పరిష్కరించుకోవడానికి అవకాశం ఏర్పడిందని అన్నారు, ఈ గ్రాంట్ ను రెండు రకాలుగా విభజించి టైడ్ గ్రాంట్ కింద మూడు కోట్ల 48 లక్షల రూపాయలను త్రాగునీటి వసతి (ఇంటింటి కొళాయి) కోసం ఖర్చు చేయడం జరుగుతుందని, అలాగే రెండు కోట్ల 32 లక్షల రూపాయలను రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ కోసం ఖర్చు చేయడం జరుగుతుంది కాబట్టి రాబోయే మూడు నెలల్లో ఆదోనిలోని వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులు జరుగుతాయని ఇది శుభసూచకం అని తెలియజేశారు. కార్యక్రమం లో మునిసిపాల్ చైర్మన్ లోకేశ్వరి ,వైస్ చైర్మన్ గౌస్,నరసింహాలు మునిసిపాల్ ఇంజినీర్ సత్య నారాయణ,కౌన్సిలర్లు,టీడీపీ,బీజేపీ నాయకులు పాల్గొన్నారు

# రిజిస్ట్రేషన్ ఇతర రాష్ట్రాల్లో చేయించడం ఎందుకు

మనగళం, కర్నూలు సిటీ : ఇతర రాష్ట్రాల్లో బస్సు రిజిస్ట్రేషన్ చేయించి దేశవ్యాప్తంగా తిరిగేందుకు అనుమతి తీసుకోవడం ఎందుకని జనతా ఫౌండేషన్ అధినేత కొత్తూరు సత్యనారాయణ గుప్తా ప్రశ్నించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల తిరుపతి జిల్లాలో, నిన్న కర్నూలు జిల్లాలో ప్రైవేట్ బస్సుల్లో పొగలు రావడం మంటలు అంటుకోవడం చూస్తే ప్రభుత్వ పర్యవేక్షణ లోపం ఉన్నట్టుగా ఉందని ఆయన తెలిపారు. వేరే రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ ఖర్చు తగ్గించుకునేందుకు చేయిస్తున్నారని, అదే రిజిస్ట్రేషన్ తెలుగు రాష్ట్రాల్లో ఎందుకు చేయించుకోరని ఆయన ప్రశ్నించారు. ఎక్కడో రిజిస్ట్రేషన్ చేయించి దేశవ్యాప్తంగా పర్మిట్ తీసుకోవడం డీజిల్ తో కాకుండా అవినీతితో బస్సులు తిరుగుతున్నాయని ఆయన విమర్శించారు. ఫ్లైట్లో ప్రయాణం చేసేటప్పుడు ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవలసిన సూచనలు ఇస్తారని, అదే విధంగా ప్రైవేట్ బస్సులో కూడా సూచనలు ఇవ్వడమే కాకుండా అందులో ఉండే టీవీలో ప్రసారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ ఆర్టీసీ కండక్టర్లకు డ్రైవర్లకు శిక్షణ తరగతులు ఉంటాయని, శిక్షణా కేంద్రాలు ఉంటాయని. కానీ ప్రైవేటు వాహన డ్రైవర్లకు ఎక్కడ శిక్షణ తరగతులు ఉండవని దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రైవేట్ బస్సులు వ్యవహరించే తీరు చట్టాలను ఉల్లంఘించి చలాన్స్ వేసిన నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని ఆయన ప్రశ్నించారు. మొదటి చలాను చెల్లించిన పక్షంలో బస్సులను తిప్పేందుకు అనుమతించకూడదని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర రవాణా శాఖ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఎందుకు అడ్డుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. హోమ్ స్టేట్ టాక్స్ తగ్గించుకునేందుకు వేరే రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారని, దీనిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రైవేట్ ట్రావెల్స్ పై ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకున్నప్పుడే ప్రాణాలకు రక్షణ ఉంటుందని అని తెలిపారు. ప్రయాణికుల భద్రత పట్ల కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు దేశ ప్రధానికి, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు తాను లేఖ లేఖల రాస్తున్నానని ఆయన తెలిపారు. అదేవిధంగా ప్రైవేట్ బస్సుల్లో ప్యాసింజర్ ప్రయాణం చేసినప్పుడు ప్రమాదానికి గురైనప్పుడు గాయాలైన మరణించిన బీమా అయ్యా కంపెనీలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని



అదేవిధంగా ప్యాసింజర్ లైబిలిటీ ఇన్సూరెన్స్ లేదా పబ్లిక్ లైబిలిటీ ఇన్సూరెన్స్ అనే పాలసీ తీసుకున్నారా లేదా అన్న దానిపై కూడా వివరాలను ప్రయాణికుడికి అందించాలని ఆయన కోరారు. అదేవిధంగా ప్రైవేట్ ట్రావెల్స్ వెబ్సైట్లో లేదా యాప్ లో టికెట్ బుక్ చేసేటప్పుడు ఆధార్ కార్డు తప్పనిసరి చేస్తే ప్రయోజనం కూడా ఉంటుందని ఆయన తెలిపారు . బస్సుల యాజమాన్యం బీమా చేయించుకొని పక్షంలో బీమా పొందడానికి వీలుండదని ఆయన తెలిపారు.

# శ్రీశైలం గుడిలో కొలువైన నాగుల కట్ట వద్ద నాగుల చవితి ప్రత్యేక పూజలు





మనగళం శ్రీశైలం : నాగులచవితిని కొన్ని ప్రాంతాలలో శ్రావణమాసంలో ఆచరిస్తుండగా, మరికొన్ని చోట్ల కార్తీకమాసంలో ఆచరిస్తున్నారు. ఈ కారణంగా కార్తీక శుద్ధ చవితి అయిన ఈ రోజున (08.08.2024) పలువురు భక్తులు ఆలయ ప్రాంగణంలోని నాగులకట్ట వద్ద నాగదేవతలను పూజించారు. ఈ రోజు వేకువజాము నుండి భక్తులు నాగులకట్ట వద్దకు చేరుకొని పత్తితో చేసిన వస్త్రం, యజ్ఞోపవీతం, పలురకాల పుష్పాలు మొదలైన వాటితో నాగమూర్తులను అలంకరించి పాలతో అభిషేకించారు. తరువాత నువ్వులపిండి, చలిమిడి, వడపప్పులను నివేదించారు.

కాగా మన సంస్కృతిలో నాగసంప్రదాయానికి ఎంతో ప్రాముఖ్యం వుంది. అదేవిధంగా శ్రీశైలంలో కూడా పలుచోట్ల నాగవిగ్రహాలు కనిపిస్తాయి. ముఖ్యంగా ఆలయ ప్రాకారంపై పలుచోట్ల నాగశిల్పాలను దర్శించవచ్చు. ఈ నాగశిల్పాలలో తూర్పు ప్రాకారంపై గల ఆదిశేషుడు, దక్షిణవైపున గల నాగబంధశిల్పం ముఖ్యమైనవి.

# సాంస్కృతిక కార్యక్రమాలు

మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (25.10.2025) అమృత కూచిపూడి నృత్య కళా నిలయము, అనంతపురం వారిచే సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్యకార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో గణపతి స్తోత్రం, శివాష్టకం, శివతాండవం, మూషికవాహన, నాగేంద్రహారాయ తదితర గీతాలకు తరుణి, గౌతమి, షణ్ముఖ, బ్రాహ్మణి, భావన, ఋత్విక తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ




పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

# ప్రెస్ క్లబ్ విద్యుత్ పరికరాలు ధ్వంసం





మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు కలెక్టరేట్ సమీపాన ఈ మధ్యనే ఏర్పాటు చేసుకున్న ప్రెస్ క్లబ్ కు సంబంధించిన విద్యుత్ పరికరాలను అపరిచితులు ధ్వంసం చేశారు. విద్యుత్ మీటర్ తోపాటు సరఫరాకు సంబంధించిన వైర్లను సైతం ధ్వంసం చేశారు. శుక్రవారం రాత్రి అపరిచితులు ప్రెస్ క్లబ్ ఎదుటే మద్యం సేవించి ఈ అరాచకానికి పాల్పడినట్లు తెలుస్తుంది. శనివారం ప్రెస్ క్లబ్ వచ్చిన అధ్యక్షుడు సత్యనారాయణ గుప్త వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి పరిసరాలను పరిశీలించారు. కూతవేటు సమీపాన కలెక్టరేట్, మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ ఉన్నా ఈ ఘటన జరగడంపై విలేకరులు అసహనం వ్యక్తం చేస్తున్నారు

# భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీశైలం

మనగళం శ్రీశైలం : కార్తీకమాసం కావటముతో శ్రీశైలం కి భక్తులు భారీగా తరలి వచ్చారు శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం పురస్కరించుకుని స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తు లు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు మల్లన్న దర్శనానికి భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచి పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లికార్జునస్వామివారి దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయడం జరిగినది.



# సంపాదకీయం

ప్రకృతి వైపరీత్యమా లేక మానవ నిర్లక్ష్యమా?

ప్రతి సంవత్సరం వర్షాకాలం వచ్చినప్పుడల్లా దేశంలోని ప్రధాన నగరాలు నీట మునిగిన దృశ్యాలను మనం చూస్తూనే ఉన్నాం. చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి మహానగరాలు వరదలతో అతలాకుతలం అవుతుండడం ఇక కొత్త విషయం కాదు. కానీ ప్రశ్న ఏమిటంటే ఇవన్నీ నిజంగా ప్రకృతి వైపరీత్యాలేనా? లేక మానవ అజాగ్రత్త, నిర్లక్ష్యం, అసంఘటిత పట్టణ ప్రణాళికల ఫలితమా? వాస్తవం ఏమిటంటే, నగర వరదలు ఇప్పుడు ప్రకృతికి కంటే మన వ్యవస్థల వైఫల్యానికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

చెన్నై 2015 వరదలను ఎవరు మరచిపోతారు? కొన్ని రోజుల్లోనే రికార్డు స్థాయిలో వర్షం పడడంతో నగరం జలప్రళయాన్ని చూశింది. కానీ తర్వాతి పరిశోధనల్లో బయటపడిన నిజాలు ఒక్కటే చెబుతున్నాయి ు ఆ విపత్తుకు కారణం కేవలం వర్షపాతం కాదుబీ నగరంలోని చెరువులు, వాగులు, నాళాలు ఆక్రమించబడడం. ఒకప్పుడు నీటి మార్గాలుగా ఉన్న చోట్ల ఇప్పుడు భవనాలు, షాపింగ్ మాల్స్, రోడ్లు నిలిచిపోయాయి. నీరు తన సహజ మార్గాన్ని వెతుక్కుంటూ ఇళ్ళలోకి ప్రవేశించింది. అదే దృశ్యం 2020 తర్వాత హైదరాబాద్‌లో, 2022లో బెంగళూరులో కూడా పునరావృతమైంది.

హైదరాబాద్ వంటి నగరాల్లో "ముసి" నది ఒకప్పుడు జీవనాధారం. ఇప్పుడు అది కాలుష్యపు నదిగా మారిపోయింది. వర్షం పడగానే పాత బస్తీ ప్రాంతాలు మొదట మునుగుతాయి. కారణం – డ్రైనేజ్ వ్యవస్థ పాతబడిపోయి ఉండటం, నాళాలపై ఆక్రమణలు, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల నీరు ఆగిపోవడం. నగరాభివృద్ధి పేరుతో ప్రతి అంగుళం భూమి నిర్మాణాల కోసం ఉపయోగించబడుతోంది. నీలం రంగులో కనిపించే చెరువులు గూగుల్ మ్యాప్‌లో మాత్రమే మిగిలిపోయాయి. నగర ప్రణాళికల్లో "నీటి ప్రవాహ దారులు" అనే మాట లేని పరిస్థితి. బెంగళూరు పరిస్థితి కూడా అంతే. ఒకప్పుడు "సరస్సుల నగరం"గా పేరు గాంచిన బెంగళూరు, ఇప్పుడు వరదల నగరంగా మారిపోయింది. అక్కడి వరదలకు కారణం కేవలం వర్షం కాదుబీ వరుసగా సరస్సులను కలిపే నాళాలు మూసివేయబడటం, చెరువులపై నిర్మాణాలు పెరగడం. ఐటీ కంపెనీలు, టెక్ పార్కులు, హైఎండ్ కాలనీలు నిర్మించడానికి ప్రకృతిని త్యాగం చేసిన నగరం ఇప్పుడు వర్షం పడగానే పాఠం నేర్పుతోంది. ఇది మనం ప్రకృతిని ఎగతాళి చేసినదానికి ప్రకృతి ఇచ్చిన ప్రతిస్పందన అని చెప్పాలి.

ప్రకృతి తన నియమాలకు కట్టుబడి ఉంటుంది. కానీ మనం నగరాలను కాంక్రీట్ అడవులుగా మార్చి, నీటి మార్గాలను మూసి, చెట్లను నరికేసి "అభివృద్ధి" అని పిలుస్తున్నాం. ఇది అభివృద్ధి కాదు, "నిర్లక్ష్యానికి కట్టిన స్మారకం." నగరాల రూపకల్పనలో వాతావరణ పరిస్థితులు, నీటి ప్రవాహ దారులు, భూభాగ ఆకృతి వంటి అంశాలు పరిగణనలోకి తీసుకోకపోవడం దురదృష్టకరం. వర్షం వచ్చినప్పుడల్లా నగరాలు మునగడం అనేది ప్లానింగ్ వైఫల్యానికి స్పష్టమైన ఉదాహరణ.

ఈ సమస్యలో మరో ముఖ్య కారణం పాలనలో సమన్వయం లేకపోవడం. పట్టణ అభివృద్ధి సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్లు, రెవెన్యూ విభాగం, పర్యావరణ శాఖ ు ఇవన్నీ తమ తమ విధుల్లో ఉండి, పరస్పర సంబంధం లేకుండా పనిచేస్తున్నాయి. ఫలితంగా నియంత్రణ లేకుండా భవన అనుమతులు ఇస్తున్నారు. ఆక్రమణలు రాజకీయ ప్రభావంతో పెరుగుతున్నాయి. తాత్కాలిక డ్రైనేజీ క్లీనింగ్‌తో సమస్య పరిష్కారమవదని, దీని వెనుక ఉన్న మూల కారణాలను గుర్తించి శాస్త్రీయ ప్రణాళిక అవసరమని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో పౌరుల బాధ్యత కూడా తక్కువ కాదు. ప్రతి వర్షాకాలంలో వీధుల్లో ప్లాస్టిక్, వ్యర్థాలు పడేయడం, నాళాల్లో చెత్త నింపడం మనమే చేస్తున్నాం. ప్రభుత్వం తప్పు చేస్తే మనం కూడా మినహాయింపుకాదు. మన నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం, నీటి మార్గాలను కాపాడడం పౌరుడి కర్తవ్యం. కానీ మనం రోజువారీ సౌకర్యాలకే ప్రాధాన్యం ఇస్తూ, దీర్ఘకాలిక ఫలితాలను మరచిపోతున్నాం.

ఇప్పుడు సమయం మార్పు కోరుకుంటోంది. వరదలతో పోరాడడం కంటే, వాటి కారణాలను తొలగించడం తెలివైన మార్గం. ప్రతి నగరానికి వర్ష జల ప్రణాళిక, చెరువుల పునరుద్ధరణ, ఆక్రమణల తొలగింపు, వర్షపు నీరు నిల్వ సదుపాయాలు ఇవన్నీ సమగ్రంగా అమలులోకి రావాలి. ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, పౌరులు కలిసి చర్యలు తీసుకున్నప్పుడే నగరాలు సురక్షితంగా ఉండగలవు.

చివరగా, మనం ప్రకృతిని గెలవలేం ఆమెతో సహజీవనం చేయడం నేర్చుకోవాలి. నగర వరదలు ప్రకృతి వైపరీత్యాలు కావుబీ అవి మన నిర్లక్ష్యానికి ప్రతిఫలాలు. ప్రకృతిని అవమానిస్తే, ఆమె ప్రతిస్పందన ఎప్పుడూ కఠినంగానే ఉంటుంది. పాఠం మనకు ఇప్పటికే వచ్చేసిందిబీ ఇప్పుడు దాన్ని అమలుచేయడం మన బాధ్యత.

**– విశ్లేషణ : మునిగాల రాజు పాత్రికేయులు,**

**డిజైనర్ టెక్ గురు. 8897975262**

## పీఎం విశ్వకర్మ యోజన కిట్లు పంపిణీ



మనగళం, కోడుమూరు : కోడుమూరు అసెంబ్లీ రూరల్ మండలం బీజేపీ కార్యాలయంలో పీఎం విశ్వకర్మ యోజన కిట్లు పంపిణీ చేశారు. పట్టనంలోని 38, 39, 40 వార్డులకు చెందిన లబ్ధిదారులకు యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు సునిల్, రాష్ట్ర నాయకులు చంద్రమోలి చేతుల మీదుగా కిట్లు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వేల్పుల గోపాల్, బెస్త ఈరన్న, మంజునాథ్, తిరుమలేష్, అదినారాయణ, శివ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## సూచీల వరుస ర్యాలీకి బ్రేక్

ముంబై, అక్టోబర్ 25, 2025 : దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేకపడింది. ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ షేర్లలో ప్రాఫిట్ బుకింగ్ జరగడంతో వరుసగా ఆరు రోజులుగా పెరుగుతూ వచ్చిన సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా తమ పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం కూడా నష్టాలను మరింత పెంచాయి. ఇంట్రాడేలో 600 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు వారాంతం మార్కెట్ ముగిసే సమయానికి సూచీ 344.52 పాయింట్లు కోల్పోయి 84,211.88 వద్ద ముగిసింది. 2,323 షేర్లు నష్టపోగా, 1,853 షేర్లు లాభాల్లో ముగిశాయి. మరో సూచీ నిఫ్టీ కూడా 96.53 పాయింట్లు కోల్పోయి 25,795.15 వద్ద స్థిరపడింది. మొత్తంమీద ఈవారంలో సెన్సెక్స్ 259.69 పాయింట్లు, నిఫ్టీ 85.3 పాయింట్ల చొప్పున అధికమయ్యాయి. సూచీల్లో హిందుస్థాన్ యూనిలీవర్ అత్యధికంగా 3.20 శాతం తగ్గి టాప్ లూజర్‌గా నిలిచింది. భారత్–అమెరికా దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలపై తొందరపడటం లేదని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వ్యాఖ్యలు మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపాయని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. రంగాలవారీగా చూస్తే బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, పవర్, కన్జ్యూమర్ డ్యూరబుల్, సర్వీసెస్ రంగ షేర్లు నష్టపోయాయి. కానీ, మెటల్, టెలికాం, ఆయిల్ అండ్ గ్యాస్, రియల్టీ, ఎనర్జీ రంగ షేర్లు లాభాల్లో ముగిశాయి.

## దోర్నాల మండలం చిన్న గుడిపాడు చెరువు వద్ద అధికారుల తనిఖీ - భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలపై చర్యలు







మనగళం, ప్రకాశం జిల్లా, అక్టోబర్ 25: ఇటీవల కురిసిన భారీ వర్షాల ప్రభావంతో చెరువులు, వాగులు ఉప్పొంగి నీటిమట్టం పెరిగిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ క్రమంలో ఈరోజు ఉదయం 9 గంటల సమయంలో శ్రీయుత జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు దోర్నాల మండలం చిన్నగుడిపాడు చెరువును అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు. తహసీల్దార్ సిహెచ్.అశోక్ కుమార్ రెడ్డి, ఎంపీడీవో నాసర్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఆర్ఐ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు, వీఆర్వో ఎస్తేరు రాణి నేతృత్వంలో గ్రామస్తులు కలిసి చెరువు పరిసరాలను పరిశీలించి, నీటి ప్రవాహం, ఎంబాంక్‌మెంట్ పరిస్థితులు, రక్షణ చర్యలను సమీక్షించారు. చెరువు పక్కన ఉన్న కాలువలు, వంతెనలు, డ్రైనేజీ మార్గాల స్థితిగతులపై అధికారులు సవివరంగా అవగాహన పొందారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అశోక్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ు "భారీ వర్షాల కారణంగా చెరువుల్లో నీటి మట్టం పెరిగినప్పటికీ, జిల్లా కలెక్టర్ సూచనల ప్రకారం అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. గ్రామస్థులు ఎటువంటి భయాందోళన చెందవద్దు. ప్రమాద సూచనలు గమనించిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నాం" అని తెలిపారు. ఎంపీడీవో నాసర్ రెడ్డి మాట్లాడుతూ ు "గ్రామ పంచాయతీ సిబ్బంది, వీఆర్వోలు, గ్రామస్థులు సమన్వయంతో వ్యవహరించడం వల్ల ఎలాంటి అపాయ పరిస్థితులు తలెత్తలేదు. అవసరమైతే చెరువుకు మరమ్మతు పనులు చేపడతాం" అని చెప్పారు. ఈ పరిశీలన కార్యక్రమంలో చిన్నగుడిపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు దొడ్డ రాజబాబు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు సహా పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు. అధికారులు ప్రజలకు జాగ్రత్త చర్యలపై సూచనలు ఇస్తూ, నీటి మట్టం స్థిరంగా ఉండే వరకు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం స్థానికంగా ప్రజలలో భరోసా నింపగా, అధికారులు ప్రదర్శించిన అప్రమత్తతకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## మోంతా తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలి

**– 27, 28, 29 తేదీల్లో నంద్యాల జిల్లాకు భారీ వర్షాల హెచ్చరిక – మైనర్ ఇరిగేషన్ ట్యాంక్ బండ్‌లను పటిష్టం చేయండి**

**– మట్టి మిద్దెల్లో నివసిస్తున్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టండి – జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**




మనగళం, అక్టోబర్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మోంతా తుఫాను ఈ నెల 27, 28, 29 తేదీల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా విపత్తు నిర్వహణపై జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, అదనపు ఎస్పీ యుగంధర్ బాబు, డీఆర్ఓ రాము నాయక్ తదితర అధికారులుతో కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ మోంతా తుఫాను చెన్నై తీరం వైపు నుండి విశాఖపట్నం దిశగా గంటకు 90%–%110 కి.మీ వేగంతో ఈదర గాలులతో కదులుతున్న నేపథ్యంలో భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉందని... అందువల్ల అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో సుమారు 330 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు ఉన్నాయని, అందులో 200 ట్యాంకులు పూర్తి స్థాయిలో నిండి ఉన్నాయని, వీటి బండ్‌లను బలపరచాలని సంబంధిత మైనర్ ఇరిగేషన్ అధికారులకు కలెక్టర్ సూచించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు మరియు అన్ని విభాగాల అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అలాగే కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ 08514%–%293903 ఫోన్ చేసి సమాచారాన్ని ఇవ్వొచ్చన్నారు. జిల్లాలో 21 వాగులు 54 గ్రామాల గుండా ప్రవహిస్తాయని, వాటి వద్ద ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పటిష్ట పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ అన్నారు. అధిక వర్షాల కారణంగా ఎటువంటి ప్రాణ, పశు నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్ని విభాగాల అధికారులునూ ఆదేశించారు. త్రాగునీటి వనరులు కలుషితం కాకుండా నిరంతరం నీటి నమూనాలు పరీక్షించి, అవసరమైతే ప్రత్యామ్నాయ వనరులు ఏర్పాటు చేయాలని డీపీఓ, డిప్యూటీ సీఈఓలకు సూచించారు. జిల్లాలో ఉన్న 13 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు సరిపడా నీటిని సరఫరా చేయగలిగేలా సక్రమ పర్యవేక్షణ చేయాలని సూచించారు. వైద్య శాఖ అధికారులు అవసరమైన మందులు, అత్యవసర సామగ్రి సిద్ధంగా ఉంచుకోవాలని, గర్భిణీ స్త్రీలకు తగిన వైద్య సహాయం అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో సుమారు 22 వేల కుటుంబాలు మట్టి మిద్దెల్లో నివాసం ఉంటున్నందున, వారికి రెవెన్యూ అధికారులు ముందస్తు నోటీసులు అందజేసి అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు సురక్షితంగా ఉండేలా ప్రత్యేక గదులు సిద్ధం చేయాలని కలెక్టర్ సంక్షేమ అధికారులను ఆదేశించారు. కుందూ నది, శ్యామ కాలువ పరివాహక ప్రాంతాలైన శ్యామ్ నగర్, దేవనగర్, బీసీ కాలనీ, గోపాల్ నగర్, సుందరయ్య నగర్, విశ్వనగర్, ఎన్జీవో కాలనీ, నూనెపల్లి, సలీంనగర్ ప్రాంతాల్లో సుమారు 600 కుటుంబాలు నీటి ప్రవాహానికి గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇందుకు అవసరమైన పాఠశాలలు, కమ్యూనిటీ హాల్స్, కళ్యాణ మండపాలను పునరావాస కేంద్రాలుగా సిద్ధం చేయాలని ఆర్డీఓకు సూచించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయడానికి టామ్‌టామ్ ద్వారా సమాచారాన్ని అందించడమే కాక, పోలీసు విభాగం సహకారం తీసుకోవాలని సూచించారు. కోతకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న పంటను వాయిదా వేయాలని, పంట నష్టాన్ని నివారించేందుకు రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖాధికారులను ఆదేశించారు. అలాగే పశు వులకు అవసరమైన మందులు, మేత నిల్వలు సిద్ధంగా ఉంచి నష్టం జరగకుండా చూడాలని పశుసంవర్ధక అధికారులను ఆదేశించారు. ప్రజలు వాగులు, వంతెనలు, కాజ్వేలు దాటకుండా అప్రమత్తం చేయాలన్నారు. ఎవరైనా ప్రమాద పరిస్థితుల్లో చిక్కుకున్నట్లయితే వెంటనే కంట్రోల్ రూమ్ 08514%–%293903 నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజల భద్రత మన ప్రధాన లక్ష్యమని ప్రతి అధికారి తన విభాగానికి సంబంధించిన బాధ్యతలను పూర్తి స్థాయిలో నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు.

## పత్తిని గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలి

– జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్



మనగళం, నంద్యాల: పట్టణంలో ఏర్పాటు చేసిన జిన్నింగుమిల్లులో పత్తిని గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలని నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ రైతులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లాస్థాయి పత్తి కొనుగోలు కమిటీ సభ్యులతో జేసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్ లో పత్తి కనీస మద్దతు ధర పొట్టి పింజ రకం రూ.7,710, పొడవు పింజరకం రూ.8110 కంటే తక్కువ ఉన్నందున నంద్యాల పట్టణంలో శ్రీ మురారి పవన్ ఆగ్రో టెక్ జిన్నింగు మిల్లు నందు కాటన్ కార్పొరేషన్ పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు తమ పత్తిని జిన్నింగుమిల్లునకు తీసుకువచ్చి గిట్టుబాటు ధరకు అమ్ముకోవచ్చునన్నారు. రైతులు జిన్నింగు మిల్లుకు తీసుకొచ్చే పత్తిని ముందుగా రైతుసేవ కేంద్రం నందు ఈ క్రాప్ రిజిస్ట్రేషన్, కపాస్ కిసాన్ అప్ లో స్లాట్ బుకింగ్ చేయించుకొని జిన్నుంగు మిల్లునకు తీసుకు రావాలని సూచించారు.పత్తికి కనీస నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ-క్రాపు రిజిస్ట్రేషన్, కపాస్ కిసాన్ అప్ లో స్లాట్ బుకింగ్ నందు నమోదు చేసుకొన్న పత్తిని మాత్రమె కొనుగోలు చేస్తారనే విషయాన్ని రైతులు గుర్తించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారి అబ్దుల్ రెహ్మాన్, జిల్లా అడిషనల్ ఎస్పీ మురారి, జిన్నింగ్ మిల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న దిగుబడులు అమ్మేందుకు పేర్లు నమోదు చేసుకోవాలి

– నంద్యాల జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్



మనగళం, నంద్యాల : జిల్లాలోని రైతులు మొక్కజొన్న దిగుబడులు అమ్మటకు రైతుసేవాకేంద్రాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్లోని తమ ఛాంబర్ నందు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలపై జిల్లా వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ మాట్లాడుతూ...జిల్లాలో ఖరీఫ్-2025 లో దాదాపు 2 లక్షల ఎకరాలలో మొక్కజొన్న సాగు చేయడం జరిగిందని, 50,000 టన్నుల మొక్కజొన్న ఉత్పత్తులు వస్తాయన్నారు. ప్రభుత్వం నుండి మొక్కజొన్నలు కొనుగోలు ఉత్తర్వులు రాగానే రైతు సేవా కేంద్రాలలో రైతులు మొక్కజొన్న అమ్మటకు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. రైతు సేవ కేంద్రాల వద్దనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జేసీ అధికారులకు సూచించారు. తుపాను ప్రభావం వలన రానున్న 4 రోజులు జిల్లాకు వర్షసూచన ఉందన్నారు. కావున మొక్కజొన్న కోతలు కొంత ఆలస్యం చేసుకునేటట్లు రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులకు జెసి సూచించారు. మొక్క జొన్న కొనుగోలుకు సంబంధించి సంచులు, గోదాములు అందుబాటులో ఉన్నాయని మార్కెఫెడ్ అధికారి తెలిపారు.

## ఐపీఓలో పెట్టుబడులకు బ్యాంకు రుణం

ముంబై: మనగళం,: తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ), మలి విడత పబ్లిక్ ఆఫరింగ్ (ఎఫ్‌పీఓ) లేదా ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్ ప్లాన్ (ఈఎసఓపీ) ద్వారా షేర్లను కొనుగోలు చేసేందుకు వ్యక్తుల (ఇండివిడ్యువల్స్)కు బ్యాంకులు రుణాలిచ్చేందుకు వీలుగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ముసాయిదా నిబంధనలను శుక్రవారం జారీ చేసింది. అలాగే, భారత కంపెనీల వ్యూహాత్మక కొనుగోళ్లు, విలీనాలకు కూడా బ్యాంకులు నిధులు సమకూర్చేందుకూ అవసరమైన ముసాయిదా నిబంధనలను కూడా విడుదల చేసింది. హేతుబద్ధీకరించిన నిబంధనలను 2026 ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. తద్వారా వ్యక్తులు.. పబ్లిక్ ఇష్యూల్లో పెట్టుబడులు పెట్టేందుకు, కార్పొరేట్ కంపెనీలు ఇతర సంస్థల్లో వాటాలు కొనుగోలు చేసేందుకు అవసరమైన నిధుల సమీకరణకు అవకాశాలు పెరగనున్నాయి. ఈ ముసాయిదా మార్గదర్శకాలపై నవంబరు 21లోగా అభిప్రాయాలు తెలపాలని సంబంధిత వర్గాలను ఆర్‌బీఐ కోరింది. సబ్‌స్క్రిప్షన్ విలువలో 75% రుణం: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (కమర్షియల్ బ్యాంక్స్-క్యాపిటల్ మార్కెట్ ఎక్స్‌పోజర్) డైరెక్షన్స్, 2025’ ప్రకారం.. ఐపీఓ, ఎఫ్‌పీఓ, ఈఎసఓపీలో భాగంగా షేర్ల కొనుగోలుకు బ్యాంకులు.. వ్యక్తికి రూ.25 లక్షల వరకు రుణం మంజూరు చేయవచ్చు. ప్రస్తుతం ఈ పరిమితి రూ.10 లక్షలుగా ఉంది. అయితే, పబ్లిక్ ఆఫరింగ్ లేదా ఈఎసఓపీ సబ్‌స్క్రిప్షన్ విలువలో బ్యాంకుల రుణ వాటా 75 శాతానికి మించకూడదని, మిగతా 25 శాతం రుణగ్రహీత సమకూర్చుకోవాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. అలాగే, పబ్లిక్ ఆఫరింగ్స్, ఈఎసఓపీలో భాగంగా రుణగ్రహీతకు కేటాయించబడే షేర్లపై బ్యాంకులకు ధరావతు హక్కు కల్పించాలని, ఆ షేర్లను కేటాయించాక రుణగ్రహీత వాటిని బ్యాంకు వద్ద తనఖా పెట్టాల్సి ఉంటుదని తెలిపింది.

## 30 నుండి తితిదే ఆధ్వర్యంలో ధార్మిక సప్తాహం



మనగళం, నందికొట్కూరు : ఆధ్యాత్మిక చింతనతోనే మనిషికి శాంతి సుస్థిరతలు చేకూరుతాయని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ నుండి నవంబర్ 5వ తేదీ వరకు నందికొట్కూరు పట్టణం, కోటవీధిలోని శ్రీ వీరభద్ర భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం నందు చేపట్టనున్న ధార్మిక సప్తాహానికి సంబంధించిన కరపత్రాలను స్థానిక ధార్మిక సంస్థల ప్రతినిధులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు సమాజం ఎంత ఉపయోగించుకుంటే అంత ప్రయోజనకరమని అన్నారు. ధార్మిక సప్తాహంలో భాగంగా 30వ తేదీ డి. జగదీశ్, ఇస్కాన్ ధర్మ ప్రచారకులు కీర్తి రాజదాస్, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ తొగట సురేశ్ బాబు, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు జి వేంకట రమణయ్య తదితరులతో కార్తిక మాస విశిష్టతపై ధార్మిక ప్రవచనాలు, ప్రతిరోజు శివస్తోత్ర, నామ పారాయణం ఉంటుందన్నారు. నవంబర్ 2వ తేదీ ఆదివారం సాయంత్రం జ్వాలాతోరణం, 5వ తేదీ సాయంత్రం సహస్ర కార్తిక దీపోత్సవం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ వీరభద్ర, భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ ఆధ్యక్షులు సాపూరు శంకరప్ప, స్కాలర్స్ పాఠశాల కరస్పాండెంట్ కాళ్ళూరి శివప్రసాద్, సాయిరాం విద్యాసంస్థల అధినేత పల్లా సుధాకర్ రెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా విశ్రాంత వైద్యాధికారి మోక్షేశ్వరుడు, ఆలయ అర్చకులు చంద్రశేఖరయ్య, ధర్మప్రచారమండలి సభ్యులు అల్లె శివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు పాటించాలి



మనగళం, నంద్యాల టౌన్ : ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) జారీ చేసిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ చాంబర్ లో కాలుష్య నియంత్రణ చర్యలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఆసుపత్రులు బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో చట్టపరమైన నిబంధనలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోగులు, సిబ్బంది, ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా వైద్య వ్యర్థాలను సక్రమంగా వేరు చేసి, శాస్త్రీయ పద్ధతిలో నిర్వర్తించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఆసుపత్రులలో కాలం చెల్లిన మందులను సక్రమంగా ధ్వంసం చేయడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. అటువంటి మందులను సాధారణ చెత్తతో కలిపి పారబోసినట్లయితే పర్యావరణానికి, ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పు కలుగుతుందని హెచ్చరించారు. అలాగే ఆసుపత్రుల చెత్తను సరైన విధంగా వేరు చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. రెడ్, యెల్లో, బ్లూ, వైట్ రంగుల బయో కోడింగ్ బ్యాగులు ఉపయోగించి ఇంజెక్షన్ సూదులు, పత్తి, గ్లౌవ్స్, శరీర వ్యర్థాలు వంటి బయోమెడికల్ వ్యర్థాలను సంచుల్లో వేరు చేయాలని సూచించారు. ఇది వ్యర్థాల శాస్త్రీయ నిర్వాహణకు కీలకమని ఆమె అన్నారు. అదేవిధంగా, ప్రతి ఆసుపత్రి, క్లినిక్, ల్యాబ్ తమ వద్ద ఉత్పత్తి అయ్యే బయోమెడికల్ వ్యర్థాల వివరాలను బయోమెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ యాప్ లో ప్రతిరోజూ డేటా ఎంట్రీ చేయడం తప్పనిసరి అని కలెక్టర్ తెలిపారు. డేటా ఎంట్రీ చేయని సంస్థలపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీక్ష అనంతరం కలెక్టర్ “చెత్తను వేరు చేసే ముందు ఆలోచించండి” అనే పోస్టర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కిషోర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ డాక్టర్ లలిత, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 28వ తేదీన మెగా రక్తదాన శిబిరం



మన గళండోన్ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21వ తేదీని లి“ పోలీస్ కమేమరేషన్ డే” లి గా దేశవ్యాప్తంగా జరుపుకుంటారు. దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులను స్మరించుకునే ఈ దినం సందర్భంగా, డోన్ సబ్ డివిజన్ డి.ఎస్.పీ. శ్రీ పి. శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో ఒక మహా రక్తదాన శిబిరం మొదట ఈ రోజు అనగా 25.10.2025 వ తేదీన జరపాలని నిర్ణయించినాము. కానీ కొన్ని అనివార్య కారణాల వలన వాయిదా వేసి తదుపరి తేదీని అక్టోబర్ 28వ తేదీ, మంగళవారం , డోన్ పట్టణంలోని క్లబ్ హౌస్ (మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగా, రైల్వే స్టేషన్ రోడ్, డోన్) వద్ద నిర్వహించబడనుంది. ఈ సత్కార్య కార్యక్రమంలో పోలీసు సిబ్బంది మాత్రమే కాకుండా, సాధారణ ప్రజలు కూడా విస్తృతంగా పాల్గొని రక్తదానం చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము. రక్తదానం ఒక మహోన్నత సేవ. ఒక యూనిట్ రక్తం మూడు ప్రాణాలను కాపాడగలదు. ప్రత్యేకంగా డోన్ టౌన్, డోన్ రూరల్, ప్యాపిలి, రాచర్ల, జలదుర్గం, బేతంచర్ల ప్రాంతాల ప్రజలు ఈ మహా రక్తదాన శిబిరంలో ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేయవలసిందిగా డీఎస్పీ శ్రీ పి. శ్రీనివాస్ మనస్ఫూర్తిగా కోరుతున్నారు. “ఒక చుక్క రక్తం – మూడు ప్రాణాల బ్రతుకుదెరువు” అనే నినాదంతో అందరం కలసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం.

## డాక్టర్ రెడ్డీస్ ఈవరిష్టు లాభం రూ.1,437 కోట్లు




హైదరాబాద్ : మనగళం: డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం 14.5 శాతం వృద్ధి చెంది రూ.1,437 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.1,255 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం రెవెన్యూ కూడా 9.8 శాతం వృద్ధితో రూ.8,016 కోట్ల నుంచి రూ.8,805 కోట్లకు చేరుకుంది. సెప్టెంబరు త్రైమాసికంలో బ్రాండెడ్ మార్కెట్లలో పనితీరు మెరుగ్గా ఉండటంతో పాటు నికోటిన్ రీప్లేసమెంట్ థెరపీ (ఎన్ఆర్‌టీ) విభాగం నిలకడగా కొనసాగటం కలిసి వచ్చిందని డాక్టర్ రెడ్డీస్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫఓ) ఎంవీ నరసింహం అన్నారు. అమెరికా ఆదాయాల్లో 13% క్షీణత: సెప్టెంబరు త్రైమాసికంలో అమెరికా మార్కెట్ నుంచి ఆదాయాలు 13 శాతం తగ్గినట్లు డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. ఈ కాలంలో అమెరికా ఆదాయాలు రూ.3,728 కోట్ల నుంచి రూ.3,241 కోట్లకు తగ్గినట్లు పేర్కొంది. లెనాలీడొమైడ్ సహా కొన్ని కీలక ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గటమే ఇందుకు కారణమని తెలిపింది. అయితే కొత్త ఉత్పత్తుల విడుదల పెరగటం, విదేశీ మారక ఆదాయం సానుకూలంగా ఉండటం కొంత కలిసివచ్చిందని పేర్కొంది. యూరప్, భారత్ ఆదాయాల్లో వృద్ధి: ఎన్ఆర్‌టీ పోర్టుఫోలియో కొనుగోలుతో యూరప్ మార్కెట్ల నుంచి ఆదాయాలు ఏకంగా 138 శాతం వృద్ధితో రూ.577 కోట్ల నుంచి రూ.1,376 కోట్లకు చేరుకున్నట్లు సీఎఫఓ నరసింహం తెలిపారు. భారత మార్కెట్ ఆదాయాలు కూడా 13 శాతం వృద్ధితో రూ.1,397 కోట్ల నుంచి రూ.1,578 కోట్లకు పెరిగినట్లు పేర్కొన్నారు. వర్ధమాన మార్కెట్ల ఆదాయాలు కూడా రూ.1,455 కోట్ల నుంచి రూ.1,654 కోట్లకు పెరిగాయి. కాగా కంపెనీ వద్ద రూ.2,750 కోట్ల మిగులు నిధులు ఉన్నాయని పేర్కొంది. అలాగే కొనుగోళ్లు, లైసెన్సింగ్ ఒప్పందాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించనున్నట్లు తెలిపింది. ఫార్మాపై అమెరికా సుంకాల ప్రభావం ప్రస్తుతానికైతే ఏమాత్రం లేదని సీఈఓ ఎరెజ్ ఇజ్రాయెలీ అన్నారు. అంతేకాకుండా సుంకాలకు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు కూడా అందుకోలేదని ఆయన పేర్కొన్నారు. అయితే బయోలాజిక్స్‌పై ఈ ప్రభా వం ఎంత ఉంటుందనే విషయాన్ని మాత్రం పరిశీలించాల్సి ఉంటుందని ఇజ్రాయెలీ తెలిపారు. కాగా వచ్చే ఏడాది పేటెంట్ గడువు తీరనున్న మధుమేహం, ఊబకాయం చికిత్స లో వినియోగించే సెమాగ్లూటైడ్ ఔషధాన్ని భారత్ సహా పలు మార్కెట్లలోకి విడుదల చేయనున్నట్లు ఆయన చెప్పారు.

## వెండిని తాకట్టు పెట్టి లోన్ తీసుకోవచ్చా?



హైదరాబాద్ : మనగళం : గత కొంతకాలంగా బంగారం, వెండి ధరలు భారీగా పెరుగుతున్నాయి. అయితే ఫ్యూచర్ లో బంగారం కంటే వెండికి ఎక్కువ డిమాండ్ ఉంటుందని వెండిలో పెట్టుబడులు పెట్టడం లాభదాయకం అని నిపుణులు కూడా సూచిస్తున్నారు. దీంతో వెండి గురించి పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఇకపై వెండిని తాకట్టు పెట్టి కూడా లోన్ తీసుకునేవిధంగా బ్యాంకులు నిర్ణయం తీసుకోనున్నట్టు మార్కెట్ వర్గాల్లో టాక్. దీని గురించి మరిన్ని వివరాల్లోకి వెళ్తే.. బంగారంతో పాటు వెండికి కూడా మార్కెట్ లో డిమాండ్ పెరుగుతోంది. ఆభరణాలతోపాటు పలు ఇండస్ట్రీల్లో కూడా వెండి వాడకం పెరుగుతుండడంతో ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా వెండి కొరత కూడా కనిపిస్తోంది. గడిచిన ఫెస్టివల్ సీజన్ లో కూడా బంగారంతోపాటు చాలామంది వెండి ఆభరణాలు, పూజా సామాగ్రి, ఇతర వెండి వస్తువులను బాగానే కొనుగోలు చేశారు.

ఆదివారం
26 - 10 - 2025

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక





## 'కాంతార: చాప్టర్ 1'పై అల్లు అర్జున్ 'మైండ్ బ్లోయింగ్' రివ్యూ!

హైదరాబాద్, మన గళం, సినిమా: భారతీయ చలనచిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టిస్తున్న చిత్రాలలో ఒకటైన లిలి'కాంతార: చాప్టర్ 1'లిలిపై ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన ప్రశంసల వర్షం కురిపించారు. రిషబ్ శెట్టి రచించి, దర్శకత్వం వహించి, నటించిన ఈ కన్నడ చిత్రంపై అల్లు అర్జున్ అద్భుతమైన రివ్యూ ఇచ్చారు. "నిన్న రాత్రి చూశాను. వావ్, ఎంతటి మైండ్-బ్లోయింగ్ సినిమా! ఆ సినిమా చూస్తున్నంత సేపు నేను ఒక ట్రాన్స్‌లో ఉన్నాను," అంటూ అల్లు అర్జున్ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ చిత్రం అందించిన విజువల్స్, భావోద్వేగాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు.

ముఖ్యంగా, ఈ సినిమాకు సంబంధించి దర్శకుడు, నటుడు రిషబ్ శెట్టి ప్రదర్శించిన బహుముఖ ప్రతిభను అల్లు అర్జున్ ప్రత్యేకంగా అభినందించారు. ఒకే వ్యక్తి రచయితగా, దర్శకుడిగా, నటుడిగా మూడు పాత్రలలో అద్భుతంగా రాణించడాన్ని ప్రస్తావిస్తూ, "రచయితగా, దర్శకుడిగా, నటుడిగా వన్-మ్యాన్ షో చేసినందుకు రిషబ్ శెట్టి గారికి హృదయపూర్వక అభినందనలు. ఆయన ప్రతి కళలోనూ రాణించారు," అని కొనియాడారు. సినిమాలోని రిషబ్ శెట్టి నటన, ఆయన విజన్, సినిమాను తీర్చిదిద్దిన విధానం తనను ఎంతగానో ప్రభావితం చేశాయని ఆయన పేర్కొన్నారు. రిషబ్ శెట్టితో పాటు, చిత్ర బృందంలోని ఇతర నటీనటులైన రుక్మిణి వసంత, జయరామ్, గుల్షన్ దేవయ్య తదితరుల నటన కూడా అద్భుతంగా ఉందని అల్లు అర్జున్ తెలిపారు. సాంకేతిక నిపుణుల పనితీరును ప్రశంసిస్తూ, ముఖ్యంగా సంగీత దర్శకుడు బి. అజనీష్ లోక్‌నాథ్ మరియు సినిమాటోగ్రాఫర్ అరవింద్ ఎస్. కశ్యప్ల కృషిని ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. ఈ సాంకేతిక అంశాలు సినిమా అనుభూతిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాయని, కథకు ప్రాణం పోశాయని ఆయన వివరించారు.

చివరిగా, అల్లు అర్జున్ నిర్మాత విజయ్ కిరగందూర్ మరియు హొంబలే ఫిలింస్ బృందానికి పెద్ద అభినందనలు తెలిపారు. "నిజాయితీగా చెప్పాలంటే, ఈ అనుభవాన్ని వర్ణించడానికి మాటలు చాలవు. చాలా ప్రేమ, ఆరాధన మరియు గౌరవం" అంటూ అల్లు అర్జున్ తన సందేశాన్ని ముగించారు. ప్రభాస్ మరియు యష్ వంటి స్టార్ హీరోల నుండి ఇప్పటికే ప్రశంసలు అందుకున్న 'కాంతార: చాప్టర్ 1'కు, ఇప్పుడు అల్లు అర్జున్ రివ్యూతో దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు లభించింది.

## 'అఖండ 2' నుండి 'బ్లాస్టింగ్ రోర్' గ్లింప్స్ విడుదల: ఊహకు అందదు!

హైదరాబాద్, మన గళం, సినిమా: నటసింహం నందమూరి బాలకృష్ణ మరియు మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం 'అఖండ 2' నుండి ఇటీవల విడుదలైన చిన్న టీజర్ (గ్లింప్స్) అభిమానులను ఒక ఊపు ఊపేసింది. 'బ్లాస్టింగ్ రోర్' పేరుతో విడుదల చేసిన ఈ గ్లింప్స్, అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా బాలకృష్ణ మార్క్ మాస్ ఎలిమెంట్స్‌తో నిండి ఉంది. కేవలం కొన్ని సెకన్ల నిడివి ఉన్నప్పటికీ, ఈ టీజర్ సినిమాపై హైప్‌ను అమాంతం పెంచింది. ఈ గ్లింప్స్‌లో బాలకృష్ణ పవర్-ప్యాక్డ్ డైలాగ్‌తో కనిపించారు. "ఏ సౌండ్‌కు నవ్వుతానో.. ఏ సౌండ్‌కు నరుకుతానో నాకే తెలియదు కొడకా.. ఊహక్కూడా అందదు!" అంటూ బాలకృష్ణ చెప్పిన డైలాగ్ ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగించింది. దర్శకుడు బోయపాటి శ్రీను ఈ డైలాగ్‌ను బాలకృష్ణ పాత్ర తీవ్రతను, ఉగ్ర రూపాన్ని చూపించేలా తీర్చిదిద్దిన తీరు అద్భుతం. ఈ పవర్-ప్యాక్డ్ విజువల్స్ మరియు డైలాగ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ రికార్డు వ్యూస్ సాధిస్తున్నాయి.

'అఖండ' (2021) చిత్రం సాధించిన భారీ విజయం నేపథ్యంలో, దాని సీక్వెల్ లిలి'అఖండ 2'లిలిపై ప్రేక్షకులలో విపరీతమైన అంచనాలు ఉన్నాయి. ఈ గ్లింప్స్ ఆ అంచనాలను మరింత పెంచేలా ఉంది. మొదటి భాగంలో ప్రేక్షకులను ఆకట్టుకున్న బాలకృష్ణ ఉగ్రరూపం, యాక్షన్ సన్నివేశాలు ఈ రెండో భాగంలో మరింత హై-వోల్టేజ్‌లో ఉండబోతున్నాయని ఈ గ్లింప్స్ స్పష్టం చేస్తోంది. సినిమా మేకింగ్ విలువలు, యాక్షన్ కొరియోగ్రఫీ ఉన్నత స్థాయిలో ఉన్నట్లు తెలుస్తోంది.

మొత్తంగా, 'అఖండ 2' 'బ్లాస్టింగ్ రోర్' గ్లింప్స్ బాలయ్య-బోయపాటి కాంబినేషన్ యొక్క మ్యాజిక్‌ను మరోసారి రుజువు చేసింది. కేవలం చిన్న టీజర్ ద్వారానే సినిమా పవర్ ఏ స్థాయిలో ఉండబోతుందో ప్రేక్షకులకు రుచి చూపించారు. ఈ గ్లింప్స్ విడుదలైన తర్వాత, సినిమా విడుదల కోసం అభిమానులు మరింత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. త్వరలోనే తదుపరి అప్‌డేట్‌లను ప్రకటిస్తారని సినీ వర్గాలు చెబుతున్నాయి.




## సౌత్ సినిమాల ఎదుగుదల సంతోషకరం: నటి ప్రియమణి



హైదరాబాద్, మన గళం, సినిమా: దక్షిణాది సినిమాల ఎదుగుదల, వాటిని ప్రేక్షకులు ఆదరిస్తున్న తీరుపై ప్రముఖ నటి ప్రియమణి సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల ఒక మీడియా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, వివిధ భాషల్లోని కంటెంట్‌ను స్వీకరించడానికి ప్రేక్షకులు మరింత సుముఖంగా ఉన్నారని ఆమె తెలిపారు. "చివరకు ప్రజలు దక్షిణాది సినిమాలను చూస్తున్నందుకు, ప్రాంతీయ భాషల్లో రూపొందించిన చిత్రాలను అంగీకరిస్తున్నందుకు నేను సంతోషిస్తున్నాను. ఇది ఎప్పుడూ ఉండేదే, కానీ అప్పట్లో దీనికి అంత ప్రాముఖ్యత లభించలేదు," అని ప్రియమణి అన్నారు. ప్రస్తుతం ఈ మార్పును గమనించడం చాలా ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు. సినిమాలతో పాటు, చిత్ర పరిశ్రమలోని మొత్తం వ్యవస్థకు ఈ ఆదరణ విస్తరించిందని ప్రియమణి అభిప్రాయపడ్డారు. "ప్రతి భాషలో అద్భుతమైన సినిమాలు వచ్చాయిబీ వాటి గురించి ఇంతకు ముందు మాట్లాడేవారు కాదు. కానీ ఇప్పుడు మాట్లాడుతున్నారు, అది చాలా గొప్ప విషయం. కేవలం సినిమాల గురించే కాకుండా, సాంకేతిక నిపుణులు, నటులు, దర్శకుల గురించి కూడా చర్చ జరుగుతోంది," అని ఆమె వివరించారు. ఈ మార్పు కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా, మొత్తం పరిశ్రమకు మేలు చేస్తుందని ఆమె అన్నారు.

ప్రాంతీయ మరియు హిందీ సినిమా మధ్య సరిహద్దులు చెరిగిపోతున్నాయని ప్రియమణి ఆశాభావం వ్యక్తం చేశారు. "ఆ సరిహద్దులు కొంతవరకు మసకబారుతున్నాయని నేను భావిస్తున్నాను, మరియు అవి ఏదో ఒక రోజు పూర్తిగా చెరిగిపోవాలని నేను ఆశిస్తున్నాను," అని ఆమె అన్నారు. భాషా భేదాలు లేకుండా, మంచి కంటెంట్‌ను దేశవ్యాప్తంగా ఆదరించడం అనేది ఆరోగ్యకరమైన పరిణామమని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

సినిమా మరియు  వేదికలపై పనిచేయడం మధ్య ఉన్న తేడాను గురించి కూడా ప్రియమణి ఈ సందర్భంగా పంచుకున్నారు. మెయిన్‌స్ట్రీమ్ సినిమాలో ఒకే రకమైన పాత్రలకు పరిమితమయ్యే అవకాశం ఉంటుందని, కానీ (ఓటీటీ) కంటెంట్‌లో ప్రయోగాలు చేయడానికి మరియు వైవిధ్యమైన పాత్రలు పోషించడానికి ఎక్కువ అవకాశం ఉంటుందని ఆమె అన్నారు. మొత్తానికి, దక్షిణాది చిత్రాలకు వస్తున్న ఆదరణ పట్ల ఆమె తన సంతోషాన్ని, పరిశ్రమలో వస్తున్న మార్పుల పట్ల తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు

## కూతురు 'దువా'ను పరిచయం చేసిన దీపికా -రణ్‌వీర్: వైరల్ అవుతున్న క్యూట్ పిక్



హైదరాబాద్, మన గళం, సినిమా : బాలీవుడ్ స్టార్ కపుల్ దీపికా పదుకొణె మరియు రణ్‌వీర్ సింగ్ తమ అభిమానులకు ఈ దీపావళి సందర్భంగా మధురమైన కానుక అందించారు. తమ కూతురు దువా ముఖాన్ని ప్రపంచానికి తొలిసారిగా పరిచయం చేస్తూ ఈ జంట ఒక హృదయాన్ని హత్తుకునే ఫోటోను సోషల్ మీడియాలో పంచుకుంది. తల్లిదండ్రులుగా మారిన తర్వాత తమ బిడ్డను మీడియాకు లేదా ప్రజలకు చూపించడానికి సుముఖత చూపని ఈ జంట, పండుగ సందర్భంగా ఈ అనూహ్య నిర్ణయం తీసుకోవడం అభిమానులను ఆశ్చర్యపరిచింది మరియు సంతోషపరిచింది. దీపికా పదుకొణె మరియు రణ్‌వీర్ సింగ్ తమ సోషల్ మీడియా ఖాతాలలో పోస్ట్ చేసిన ఈ ఫోటోలో, దువా ఇద్దరి మధ్య ఉండి, చిరునవ్వుతో, బొద్దుగా చాలా క్యూట్‌గా కనిపించింది. సాంప్రదాయ దుస్తులలో మెరిసిపోతున్న ఈ ముగ్గురూ పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించారు. ఫోటో కింద, "మా దీపావళి శుభాకాంక్షలు... దువా, ప్రేమ, ప్రకాశం" అని ఒక చిన్న సందేశాన్ని జోడించారు. ఈ పోస్ట్ క్షణాల్లో వైరల్ అయింది, లక్షలాది లైకులు మరియు వేల సంఖ్యలో అభినందనలు వెల్లువెత్తాయి. తల్లిదండ్రులుగా దీపికా, రణ్‌వీర్ తమ వ్యక్తిగత జీవితాన్ని చాలా ప్రైవేట్‌గా ఉంచుతారు. దువా పుట్టినప్పటి నుండి, ఆమె ఫోటోలు బయటికి రాకుండా జాగ్రత్త పడ్డారు. గతంలో, వారు బిడ్డ ప్రైవసీకి గౌరవం ఇవ్వాలని కోరారు. అయితే, పండుగ సందర్భంగా తామే స్వయంగా తమ కూతురిని అభిమానులకు పరిచయం చేయాలని నిర్ణయించుకోవడం పట్ల నెటిజన్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బాలీవుడ్ ప్రముఖులు సైతం ఈ పోస్ట్‌పై కామెంట్ల రూపంలో తమ ప్రేమను మరియు ఆశీస్సులను అందించారు. మొత్తంగా, ఈ క్యూట్ కుటుంబ చిత్రం దీపికా-రణ్‌వీర్ అభిమానులకు ఈ దీపావళిని మరింత ప్రత్యేకం చేసింది. వారి కూతురు 'దువా' సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది, అందరూ ఈ బుల్లి స్టార్‌ను చూసి మురిసిపోతున్నారు. వ్యక్తిగత జీవితంలో సంతోషంగా ఉన్న ఈ జంట, వృత్తిపరంగా కూడా త్వరలో కొత్త ప్రాజెక్టులతో బిజీ కానున్నారు.

## 'దేవర'లో జాన్వీ కపూర్ 'తంగమ్'గా: డీ-గ్లామరస్ పాత్రలో తొలి తెలుగు ఎంట్రీ!



హైదరాబాద్,మన గళం, సినిమా : బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ టాలీవుడ్‌లో తొలిసారిగా అడుగుపెడుతున్న చిత్రం జూనియర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ చిత్రం 'దేవర'. ఈ సినిమా నుండి ఆమె పాత్రకు సంబంధించిన ఆసక్తికరమైన అప్‌డేట్ వెలువడింది. ఈ చిత్రంలో ఆమె పోషిస్తున్న పాత్ర పేరు 'తంగమ్' అని తెలుస్తోంది, దీనికి 'బంగారం' అని అర్థం. జాన్వీ కపూర్ ఒక శక్తివంతమైన మరియు డీ-గ్లామరస్ పాత్రతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం కానుండటం విశేషం. 'దేవర' చిత్రం దేశంలో విస్మరణకు గురైన తీర ప్రాంతాల నేపథ్యంతో రూపొందుతున్నట్లు సమాచారం. ఈ చిత్ర కథాంశం ప్రకారం, జాన్వీ కపూర్ ఒక మురికివాడ బస్తీలో జీవనం సాగించే యువతి పాత్రలో కనిపించబోతున్నారు. ఆమె పాత్ర స్వభావం దృష్ట్యా, కొన్ని సన్నివేశాలలో ఆమె డీ-గ్లామరస్‌గా కనిపించాల్సి ఉంటుంది. సాధారణంగా గ్లామరస్ పాత్రలకే ప్రాధాన్యత ఇచ్చే జాన్వీ, తన తొలి తెలుగు సినిమాతోనే ఇంతటి ఛాలెంజింగ్ మరియు డీ-గ్లామరస్ రోల్‌ను ఎంచుకోవడం ఆమె పాత్రకు ఉన్న ప్రాధాన్యతను సూచిస్తుంది. జాన్వీ కపూర్ ఈ పాత్ర కోసం ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పాత్ర యొక్క వేషధారణ, శరీర భాషతో పాటు, తెలుగు భాష యొక్క ఉచ్ఛారణలో స్పష్టత ఉండేలా ఆమె ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారట. ఇది కేవలం ఒక గ్లామర్ పాత్ర కాకుండా, కథాగమనంలో ముఖ్యమైన పాత్రగా ఉంటుందని సినీ వర్గాల సమాచారం. జాన్వీ పాత్రకు సంబంధించిన లోతు ఈ సినిమాలో హైలైట్ కానుందని మేకర్స్ చెబుతున్నారు. నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. 'దేవర' మొదటి భాగం అక్టోబర్ 10న విడుదల కానుంది. ఎన్టీఆర్ సరసన జాన్వీ కపూర్ నటిస్తున్న ఈ చిత్రం, దేశవ్యాప్తంగా అంచనాలను భారీగా పెంచింది. ఈ డీ-గ్లామరస్ పాత్రలో జాన్వీ నటన చూడటానికి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా: మూడో ఒకరోజు అంతర్జాతీయ మ్యాచ్ తాజా సమాచారం



సిడ్నీ, మన గళం, : ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడు ఒకరోజుల క్రికెట్ మ్యాచ్‌ల శ్రేణిలో చివరిదైన మూడో పోరు సిడ్నీ మైదానంలో జరుగుతోంది. ఇప్పటికే తొలి రెండు మ్యాచ్‌లలో ఓటమి పాలైన భారత జట్టుకు ఇది నామమాత్రపు మ్యాచ్ అయినప్పటికీ, వైట్ వాష్ (పూర్తి ఓటమి) కాకుండా పరువు నిలుపుకోవాలనే పట్టుదలతో ఉంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆస్ట్రేలియా జట్టు మొదట బ్యాటింగ్‌ను ఎంచుకుంది. భారత బౌలర్లు చక్కగా రాణించడంతో ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ మొత్తం 236 పరుగులకే ముగిసింది. ఆతిథ్య జట్టును తక్కువ పరుగులకే కట్టడి చేయడంలో యువ వేగవంతమైన బౌలర్ హర్షిత్ రాణా కీలక పాత్ర పోషించాడు. దీనితో, భారత జట్టు గెలవడానికి 237 పరుగులు చేయాల్సి ఉంది. అయితే, ఈ ఇన్నింగ్స్ సమయంలో భారత జట్టుకు ఒక ఎదురుదెబ్బ తగిలింది. అద్భుతమైన క్యాచ్ పట్టిన ఉప సారథి శ్రేయస్ అయ్యర్, గాయం కారణంగా మైదానాన్ని వీడాల్సి వచ్చింది. అయ్యర్ గాయం తీవ్రతపై జట్టులో ఆందోళన నెలకొంది. ఈ మ్యాచ్ ఫలితం భారత క్రికెట్ అభిమానులకు, జట్టుకూ అత్యంత కీలకంగా మారింది. భారత బ్యాటర్లలో ఎవరైనా శతకాలు సాధించి జట్టుకు విజయాన్ని అందిస్తారని అభిమానులు ఆశిస్తున్నారు.

## మహిళల ప్రపంచ కప్ సెమీఫైనల్స్ వివరణ




న్యూజిలాండ్ ,మన గళం, : ఐసీసీ మహిళల ఒకరోజు ప్రపంచ కప్ రెండు వేల ఇరవై ఐదులో భారత జట్టు విజయం సాధించి సెమీఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. వరుసగా మూడు ఓటములు ఎదురైన తర్వాత, న్యూజిలాండ్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ విధానం ద్వారా యాభై మూడు పరుగుల తేడాతో గెలుపొందడం భారత మహిళల జట్టుకు గొప్ప ఊరటనిచ్చింది. ఈ విజయంతోనే భారత్ టోర్నీలో చివరి నాలుగు జట్లలోకి ప్రవేశించింది. ప్రారంభ క్రీడాకారిణులు స్మృతి మంధాన, ప్రతికా రావల్ అద్భుతమైన శతకాలతో జట్టుకు విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించారు. వీరి అద్భుతమైన భాగస్వామ్యం భారీ పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించడానికి దోహదపడింది. ఇప్పుడు భారత జట్టు సెమీఫైనల్ మ్యాచ్‌ను అక్టోబర్ ఇరవై తొమ్మిదవ తేదీన గౌహతి మైదానంలో ఆడాల్సి ఉంది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన జట్టుతో (ఆస్ట్రేలియా లేదా దక్షిణాఫ్రికా) భారత్ తలపడనుంది. ఈ ముఖ్యమైన పోటీలో భారత జట్టు ఎలాంటి ప్రదర్శన చేస్తుందనేది దేశవ్యాప్తంగా క్రికెట్ అభిమానులలో ఆసక్తిని పెంచుతోంది.

## కెట్ దిగ్గజం విరాట్ కోహ్లీపై చర్చ



సిడ్నీ, మన గళం, : ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఒకరోజు అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌ల శ్రేణిలో భారత జట్టు ఆటగాడు విరాట్ కోహ్లీ ఆటతీరుపై ప్రస్తుతం క్రీడా వర్గాలలోనూ, అభిమానులలోనూ పెద్ద చర్చ నడుస్తోంది. మొదటి రెండు మ్యాచ్‌లలో కోహ్లీ సున్నా పరుగులకే వెనుదిరగడం అందరినీ ఆశ్చర్యపరిచింది. వరుసగా రెండు మ్యాచ్‌లలో డకౌట్ కావడంతో, ఆయన ఆట జీవితం ముగింపు దశకు చేరుకుందా అనే సందేహాలు, వదంతులు సామాజిక మాధ్యమాలలో విపరీతంగా వ్యాపించాయి. ఈ నేపథ్యంలో, కోహ్లీ త్వరలోనే ఒకరోజు అంతర్జాతీయ మ్యాచ్‌ల నుంచి తప్పుకుంటాడని ప్రచారం ఊపందుకుంది. అయితే, సునీల్ గవాస్కర్ వంటి మాజీ క్రికెట్ దిగ్గజాలు ఈ వదంతులను తీవ్రంగా ఖండించారు. కోహ్లీ అంత సులభంగా క్రికెట్‌ను వదిలిపెట్టే వ్యక్తి కాదని, సరైన సమయంలో, తన ఇష్టానుసారం మాత్రమే నిర్ణయం తీసుకుంటాడని వారు అభిప్రాయపడ్డారు. ఈ రోజు ఆస్ట్రేలియాతో జరుగుతున్న చివరి మ్యాచ్‌లో కోహ్లీ అక్టోబర్ 25 నాటి తన చెత్త రికార్డును చెరిపేసి, తన ఆటతో విమర్శకులకు సమాధానం చెబుతాడని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## క్రీడా యోధుడు నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం



న్యూఢిల్లీ, మన గళం, : ఒలింపిక్ క్రీడలలో స్వర్ణ పతకాన్ని సాధించి దేశ కీర్తిని పెంచిన క్రీడాకారుడు నీరజ్ చోప్రాకు భారత ప్రభుత్వం అరుదైన గౌరవాన్ని కల్పించింది. జావెలిన్ విసిరే క్రీడలో అద్భుత ప్రతిభ కనబరిచిన ఈ క్రీడా యోధుడికి సైనిక విభాగంలో ప్రత్యేక హోదా లభించింది. ఈ అరుదైన అవకాశం ద్వారా, నీరజ్ చోప్రా ఇకపై కేవలం క్రీడాకారుడిగానే కాకుండా, దేశ రక్షణ శాఖలో ఒక గౌరవనీయమైన పదవిని అలంకరించనున్నారు. దేశం కోసం క్రీడారంగంలో ఆయన చేసిన సేవలను గుర్తించి, ఈ ప్రత్యేక సైనిక హోదాను ఇవ్వడం జరిగింది. యువతకు, క్రీడాకారులకు ఇది గొప్ప ప్రేరణగా నిలుస్తుందని, దేశం క్రీడాకారులను ఎంతగా గౌరవిస్తుందో చెప్పడానికి ఈ నిర్ణయం ఒక నిదర్శనమని క్రీడా పండితులు అభిప్రాయపడుతున్నారు.

## ప్రో కబడ్డీ లీగ్ తాజా విశేషాలు



బెంగళూరు, మన గళం, : ప్రస్తుతం కొనసాగుతున్న పన్నెండవ ప్రో కబడ్డీ లీగ్ పోటీలు తుది దశకు చేరుకుంటున్నాయి. ఈ కబడ్డీ సమరంలో బెంగళూరు బుల్స్ జట్టు అద్భుతమైన ఆటతీరుతో ముందుకు సాగుతూ, పట్టికలో అగ్రస్థానం దిశగా అడుగులు వేస్తోంది. గురువారం నాడు జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ గుజరాత్ జెయింట్స్ జట్టును చిత్తు చేసి విజయం సాధించింది. ఈ గెలుపుతో బెంగళూరు జట్టు చివరి నాలుగు జట్లలో అంటే ప్లేఆఫ్స్‌లో చోటు దక్కించుకుంది. మిగిలిన జట్లు సైతం చివరి నాలుగు స్థానాల కోసం హోరాహోరీగా పోరాడుతున్నాయి. మరోవైపు, తెలుగు రాష్ట్రాలకు చెందిన తెలుగు టైటాన్స్ జట్టు కూడా ప్లేఆఫ్స్‌లో చోటు సంపాదించాలంటే రాబోయే మ్యాచ్‌లలో మంచి ప్రదర్శన చేసి, విజయాల శాతం పెంచుకోవాల్సిన అవసరం ఉంది. పోటీ తీవ్రంగా ఉన్నందున ఏ జట్టు కప్పును గెలుచుకుంటుందో అనే ఉత్కంఠ కబడ్డీ అభిమానులలో నెలకొని ఉంది.

## విరాట్ కోహ్లీ ఆటతీరుపై గవాస్కర్ వ్యాఖ్య, మ్యాచ్ తాజా పరిస్థితి



సిడ్నీ, మన గళం, : ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఒకరోజు అంతర్జాతీయ మ్యాచ్‌ల శ్రేణిలో భారత జట్టు ప్రముఖ ఆటగాడు విరాట్ కోహ్లీ వరుసగా రెండు మ్యాచ్‌లలో సున్నా పరుగులకే నిష్క్రమించడంపై తీవ్రమైన చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో, కోహ్లీ ఆట జీవితం ముగింపునకు వచ్చిందనే వదంతులు, త్వరలోనే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు చెబుతాడనే ఊహాగానాలు విపరీతంగా పెరిగాయి. ఈ ప్రచారంపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ స్పందించారు. 'కోహ్లీ అంత తొందరగా క్రికెట్‌కు దూరమయ్యే పిరికివాడు కాడు' అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. కోహ్లీ పూర్తి శక్తి సామర్థ్యాలతో ఉన్నాడని, తన ఇష్టానుసారం, సరైన సమయం చూసుకుని మాత్రమే ఆట నుంచి తప్పుకుంటాడని, ప్రస్తుతానికి ఆ చర్చ అవసరం లేదని గవాస్కర్ స్పష్టం చేశారు.

?ఇక సిడ్నీలో జరుగుతున్న మూడో మ్యాచ్ విషయానికి వస్తే, భారత్ ముందు 237 పరుగుల లక్ష్యం ఉంది. అయితే, సిడ్నీ మైదానం భారత్‌కు చారిత్రక రికార్డుల పరంగా అస్సలు కలిసి రాలేదు. గతంలో ఆడిన చాలా మ్యాచ్‌లలో భారత్ ఇక్కడ ఓటమి పాలైంది. ఈ మ్యాచ్‌లో భారత ఆరంభ ఆటగాళ్లు తమ జట్టుకు శుభారంభం ఇవ్వడం అత్యంత ముఖ్యం. ప్రస్తుతం, ఓపెనర్లు క్రీజులో నిలదొక్కుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే, సిరీస్‌ను కోల్పోయిన భారత జట్టు ఈ చివరి మ్యాచ్‌లో గెలిచి పరువు నిలుపుకుంటుందా, లేదా ఆస్ట్రేలియా వైట్‌స్వీప్ చేస్తుందా అనే ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ మ్యాచ్‌లో భారత బ్యాటర్లు మంచి భాగస్వామ్యాలు నెలకొల్పి, విమర్శలకు ఆట ద్వారానే సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

## ఆసియా కప్ కప్పు అందజేత వివాదంపై రచ్చ




దుబాయ్, మన గళం, : ఆసియా కప్ గెలిచిన తరువాత విజేత అయిన భారత జట్టుకు కప్పును అందించడంలో జరిగిన ఆలస్యం మరియు వివాదం క్రీడా వర్గాలలో తీవ్ర చర్చనీయాంశమైంది. విజేత జట్టు కప్పును అందుకోవడానికి ఎక్కువ సమయం వేచి చూడాల్సి వచ్చిందని, కనీసం మైదానంలోకి కూడా ట్రోఫీని తేవడానికి చాలాసేపు పట్టదని భారత యువ ఆటగాడు తిలక్ వర్మ స్వయంగా వెల్లడించడం ఈ వివాదానికి మరింత ఆజ్యం పోసింది.

పాకిస్తాన్ క్రికెట్ మండలి అధ్యక్షులు కప్పును తీసుకుని పారిపోయాడని, ఆ తరువాత నిబంధనలకు విరుద్ధంగా తమ కార్యాలయంలో దాచి ఉంచాడని వార్తలు వచ్చాయి. దీనిపై భారత్‌కు చెందిన క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కప్పు విషయంలో జరిగిన ఈ అవకతవకలపై పాకిస్తాన్ మండలి అధ్యక్షులకు భారత క్రికెట్ నియంత్రణ మండలి తరఫున గట్టి హెచ్చరికలు జారీ అయ్యాయని సమాచారం. అంతర్జాతీయ క్రీడా పోటీలకు సంబంధించిన నిబంధనలు, క్రీడా స్ఫూర్తిని ఉల్లంఘిస్తూ ఇలా ప్రవర్తించడం సరైనది కాదని భారత క్రికెట్ మండలి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ మొత్తం సంఘటన రెండు దేశాల క్రికెట్ మండలాల మధ్య ఉన్న సంబంధాలను మరింత దెబ్బతీసే అవకాశం ఉంది.

## రోహిత్ శర్మ వన్డేల్లో 33వ సెంచరీ సాధన



ఇండోర్, మన గళం, : భారత వన్డే జట్టు ఆస్ట్రేలియా తో ఇండోర్ మైదానంలో ఎదురైన మ్యాచ్‌లో సూపర్ బ్యాట్స్‌మన్ రోహిత్ శర్మ అద్భుత ప్రదర్శన చేశారు. తన కెరీర్‌లో లిలి33వ సెంచరీలిలిని నమోదు చేయడం ద్వారా రోహిత్ భారత క్రికెట్‌లో ఒక కొత్త మైలురాయి సృష్టించారు. ఈ సెంచరీ తన జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. భారత జట్టు ఆస్ట్రేలియాను ఎదుర్కొని గెలుపునకు దగ్గరగా నిలిచింది. అభిమానులు, క్రీడా నిపుణులు రోహిత్ శర్మ ప్రదర్శనను ఉత్సాహభరితంగా ప్రశంసిస్తున్నారు.

Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310